



నమో నమః

రథసప్తమి సందర్భంగా రాజధాని గ్రామం వెంకటపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. భక్తులు గోవింద నామ స్మరణతో ఊరేగింపులో పాల్గొన్నారు.

ప్రభల పనులు ప్రారంభం

- ఊరంతా ఏకమై పోటాపోటీగా నిర్మాణం
- 90 అడుగులకు పైగా ఎత్తులో 20 వరకు కొండకు రాక

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభల పండుగగా పేరొందిన, కోటప్పకొండ తిరునాళ్లకు భారీ విద్యుత్ ప్రభల నిర్మాణ పనులు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. పల్లెల్లో పోటాపోటీగా ప్రభలను నిర్మిస్తున్నారు. 90 అడుగులకుపైగా ఎత్తులో ప్రభలు రూపుదిద్దుకుంటున్నాయి. తిరునాళ్ళకు 15 నుంచి 20 వరకు భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తాయని అంచనా. గ్రామ ప్రతిష్ఠ కోసం అందంగా ప్రభలను నిర్మించడంలో పోటీ ఉంటుంది. ఊరంతా కలసి కట్టుగా ప్రభల పనుల్లో పాల్గొంటు న్నారు. ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడ తాయి. ఈ ప్రభలలో పోస కూర్పు, మండపాలు, టిక్కీలు, విద్యుత్, బాల ప్రభలు ఉంటాయి. నరసరావుపేట మండలం లోని గురవాయపాలెం, ఉప్పలపాడు, కాకాని, చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం, యడవల్లి, కోమటినేనివారి పాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు, బొప్పూడి గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం గ్రామస్తులు చేపట్టారు.



గురవాయపాలెంలో జరుగుతున్న ప్రభ పనులు

జీవనశైలి మార్పుతోనే క్యాన్సర్ నివారణ

క్యాన్సర్ దినోత్సవంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక క్యాన్సర్ నుంచి ప్రజలు తప్పించుకోవాలంటే జీవనశైలిలో మార్పులు రావాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాపట్లలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, అధికారులు చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. దురవ్యసనాలకు దూరంగా ఉండి క్యాన్సర్ ముప్పును నిరోదిద్దామంటూ విద్యార్థులు ప్లకార్డులు చేతబూని నాదాలు చేశారు. అనంతరం పాతబస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ఎదుర్కోవడానికి ప్రజల ఆహార అలవాట్లలో మార్పు అవసరమన్నారు. చెడు వ్యసనాలు మానాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడే క్యాన్సర్ వ్యాధిని అరికట్టగలమన్నారు. క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసలై క్యాన్సర్‌కు గురికావద్దన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని, శారీరక శ్రమ ఎంతో ఉపయుక్తమన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్డీవో పి.గ్లోరియా, పీడీలు ఉమా, పద్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణభట్టు, ఎన్‌సీడీసీడీ డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ జె.వెంకటమురళి



బాపట్లలోని పాతబస్టాండ్ ఆవరణలో విద్యార్థుల మానవహారం

కౌలు రుణాలు.. తీసికట్టు

- వార్షిక పద్దులో ఘనంగా లక్ష్యాలు
- అరకొరగానే బ్యాంకుల నుంచి రుణాలు





కౌలు రైతుల కష్టాలు తీరుస్తాం.. రుణాలు అందిస్తాం.. అప్పుల ఊబి నుంచి గట్టెక్కిస్తాం.. అని అటు అధికారులు, ఇటు పాలకుల హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఈ ఏడాది బ్యాంకుల నుంచి కౌలు రైతులకు అందిన రుణాలే ఇందుకు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. వార్షిక పద్దులో 95 శాతం లక్ష్యాలు సాధించినట్లు అటు అధికారులు, ఇటు బ్యాంకర్లు ప్రకటిస్తున్నాయి. అయితే అందు లో కౌలు రైతుల వాటా చూస్తే తీసికట్టుగా ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలో ప్రకటించిన వార్షిక పద్దులో మెజార్టీ వాటాపై భారీగా ఆశలు పెట్టుకోగా కౌలురైతులకు నిరాశే ఎదురైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యామని కూటమి ప్రభుత్వంలో పరిస్థితిలో మార్పు రాలేదనే ఆవేదన కౌలు రైతుల్లో నెలకొంది. రుణాల విషయంలో ఎప్పుడూ చెప్పే సాకులతో అధికారులు సరిపెడుతున్నారు. ప్రభుత్వం మారినా కౌలు రైతుల పరిస్థితిలో మార్పు లేదనడానికి అధికారులు ప్రకటించిన గణాంకాలే సంకేతంగా ఉన్నాయి. అంతిమంగా కౌలు రైతులు అధిక వడ్డీకి అప్పులు తెచ్చి సేద్యం చేసి అప్పుల పాలవుతున్నారు.

- సాకులతో యథావిధిగా సరిపెట్టిన అధికారులు
- సీసీఆర్‌సీ కార్డులున్నా బ్యాంకర్ల నుంచి చిన్నచూపు
- అధిక వడ్డీలతో అప్పుల పాలైన కౌలు రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన వేల కోట్ల రుణ పద్దులో కౌలు రైతులను ఉదారంగా ఆదుకుంటామనే హామీలు గుప్పించారు. దీంతో రుణాల విషయంలో తమకు న్యాయం జరుగుతుందని కౌలు రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులకు ఆర్థిక సంవత్సరంలో అందించిన రుణాలు అంతా కలిపి రూ.50 కోట్లకు మించలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా వార్షిక పద్దులో తమ వాటా గణనీయంగా పెరుగుతుందని ఆశించారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా వార్షిక రుణ పద్దులో వందశాతం లక్ష్యాలను చేరుకున్నట్లు బ్యాంకులు ఘనంగా ప్రకటిస్తాయి. అయితే వీటిలో కౌలు రైతుల వాటా ఎంతంటే ఈ ఏడాది కూడా బేలచూపులు చూడాల్సిన పరిస్థితే ఉంది. ప్రారంభంలో చెప్పినట్లు రుణాలలో కౌలు రైతులకు కేటాయించిన శాతం మేరకు వారికి ప్రయోజనం చేకూరలేదు.

వేల కోట్ల వార్షిక పద్దు.. అయినా నిరాశే..

ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి వార్షిక రుణ పద్దును అధికారులు ప్రకటిస్తారు. ఇందులో మెజారిటీ వాటా సేద్యానికే దక్కుతుంది. కానీ ఆ రుణ ఫలాలు అందుకోవడంలో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఎక్కువ శాతం సర్దుబాటులే తప్ప రైతుల చేతికి వచ్చే రుణాల శాతం బహుస్వల్పం అని గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. బాపట్ల జిల్లాలో వ్యవసాయ అనుబంధ రుణాలకు రూ.10,053 కోట్ల ఇవ్వనున్నట్లు వార్షిక పద్దులో తెలిపారు. ఇందులో పంట రుణాల వాటా రూ.6,321 కోట్లను నిర్దేశించగా ఇప్పటికి రూ.5,800 కోట్లు అందించారు. గుంటూరు జిల్లాలో వ్యవసాయానుబంధ రంగాల వాటాగా రూ.13,613 కోట్లను ప్రకటించగా, పంట రుణాలకు రూ.8,560 కోట్లు కేటాయించారు. పల్నాడు జిల్లాలో రూ.13,210 కోట్లుగా పేర్కొనగా, పంట రుణాలు (మిగతా 6వ పేజీలో)

సీసీఆర్‌సీ కార్డులు ఘనంగా జారీ..

వైసీపీ ఐదేళ్ల పాలనతో పోలిస్తే సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డ్)ల జారీ విషయంలో ఈ ఆర్థిక సంవత్సరంలో పురోగతి ఉంది. గతంతో పోలిస్తే దాదాపు రెట్టింపు కార్డులను కౌలు రైతులకు అందించారు. బాపట్ల జిల్లాలో 1,06,300 సీసీఆర్‌సీ పత్రాలు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించగా 95 శాతం చేరుకున్నారు. గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడు జిల్లాలో 68,000 కార్డులకు 90 శాతం లక్ష్యాలను చేరుకోగలిగారు. ఈ కార్డులు జారీ చేసిన వారి సంఖ్యలో సగం మందికి అయినా రుణాలు అందించాలనే లక్ష్యాన్ని ఆర్థిక సంవత్సరం ఆరంభంలో ప్రభుత్వం పెట్టుకుంది. కానీ ముగింపుకొచ్చేసరికి రుణాలు అందుకున్న వారి గణాంకాలు మరీ దిగదుడుపుగా ఉన్నాయి.



రూ.520 కోట్లకు రూ.100 కోట్లే..

ఈ ఏడాది ఆరంభంలో వార్షిక పద్దు ప్రకటనకు.. ఇప్పటి వరకు కౌలు రైతులకు అందించిన రుణాల గణాంకాలను పరిశీలిస్తే ఎంత తీసికట్టుగా ఉన్నాయో అర్థమవుతుంది. బాపట్ల జిల్లాలో రూ.200 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.170 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.150 కోట్ల రుణాలను కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టింది. కానీ బాపట్ల జిల్లాలో రూ.40 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.32 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.28 కోట్లకే పరిమితమైంది. ఈ స్వల్ప మొత్తాలలో కూడా ఒక్క సీసీఆర్‌సీ కార్డులే కాకుండా జేఎల్‌జీ, రైతుమిత్ర గ్రూపులు కలిసి ఉండడం కౌలు రైతులపై ఉన్న శీతకన్నుకు అద్దం పడుతోంది.

చీరాలలో.. విగ్రహ రగడ

రోజురోజుకూ నిప్పురాజుకుంటున్న వివాదం

పసుపు నీళ్లతో శుద్ధి.. కలెక్టర్‌కు టీడీపీ కౌన్సిలర్ల ఫిర్యాదు

చీరాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చీరాలలో విగ్రహ రాజకీయ రగడ కూటమి నాయకుల మధ్య చిచ్చు రేపుతోంది. విగ్రహ నిర్మాణాన్ని వేదికగా చేసుకుని కయ్యానికి కాలు దువ్వుకుంటున్నారు. ఇటీవల మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని కౌన్సిల్ అంగీకారంతో కలెక్టర్‌కు సిఫారసుకు పంపాలని కోరుతూ అజెండాలో 6వ అంశంగా అధికారులు పొందుపరిచారు. ఈ నెల 1న జరిగిన అత్యవసర సమావేశంలో ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొనిగల జైసన్‌బాబు అనుమతించారు. దీంతో ఇన్‌చార్జి చైర్మన్ సంతకంతో కూడిన పత్రం అందుకున్న పాలేటి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హడావుడిగా శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వైసీపీ కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకరరావు, బత్తుల అనిల్ సైతం హాజరయ్యారు.

ఆగ్రహించిన కూటమి నేతలు

ఈ విషయం తెలిసిన కూటమి నేతలు మంగళవారం పట్టణంలో నిరసన చేపట్టారు. శంకుస్థాపన జరిగిన ప్రదేశంలో పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహ రాజకీయాలు చేయడంలో పాలేటి దిట్ట అన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరిపాలన జరుగుతుంటే ఓర్వలేని పాలేటి.. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలం ఉండగా ఉద్దేశ పూర్వకంగానే గడియార స్తంభం కూడలిలో శంకుస్థాపన చేసి విభేదాలు సృష్టిస్తున్నారని మండి పడ్డారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి పాలేటి వ్యవహారాన్ని తీసుకువెళతామన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

స్థానికంగా జరుగుతున్న వ్యవహారంపై టీడీపీ కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, సల్లూరి సత్యానందం, సూరగాని లక్ష్మి, పొత్తూరి సుబ్బయ్య, మల్లెల లలిత కలెక్టర్ వెంకటమురళిని కలిసి ఫిర్యాదు చేశారు. గడియార స్తంభం కూడలిలో కాకుండా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు సమీపంలో విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఉద్దేశపూర్వకంగానే పాలేటి వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. విషయంపై న్యాయపరమైన విచారణ జరపాలని కోరారు. విగ్రహ రాజకీయంతో చీరాలలో వివాదాలు రేగడంతో ఇటు పోలీసుల్లో అటు ప్రజల్లో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన వాతావరణం నెలకొంది.



కలెక్టర్ వెంకటమురళికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

విగ్రహ ఏర్పాటుకు అనుమతులు లేవు

మున్సిపల్ అజెండాలో విగ్రహం విషయమై అంశాన్ని పొందుపరిచారని, అందులో కలెక్టర్ దృష్టికి మాత్రమే తీసుకు వెళుతున్నట్లు మాత్రమే ఉందని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేయాలంటే కమిటీ అనుమతి తప్పనిసరన్నారు. అనుమతులు వచ్చాకే నిర్మాణాలు జరుగుతాయని, భిన్నంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.



పసుపు నీళ్లతో శుద్ధి చేస్తున్న కూటమి నాయకులు

నేటితో ముగియనున్న గడువు

- గీత కార్మికులకు 12 మద్యం దుకాణాలు
- దరఖాస్తుల స్వీకరణ నేటి వరకే.. 7న లాటరీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మొత్తం మద్యం షాపుల్లో పదిశాతం అంటే 12 దుకాణాలను గీత కార్మిక కులాలకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు గడువు బుధవారంతో ముగియనుంది. ఇప్పటి వరకు 12 షాపులకు 20 దరఖాస్తులు వచ్చాయి. షాపుల కేటాయింపు సహేతుకంగా లేదని ప్రక్రియపై స్టే విధించాలని కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ తీర్పు ఎలా ఉండబోతుందోనన్న అనుమానంతో దరఖాస్తు చేసుకోవడానికి ఆశావహులు పెద్దగా ఆసక్తి చూపలేదు. కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ మంగళవారం హైకోర్టు నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో బుధవారం భారీగా దరఖాస్తులు రావచ్చని ఎక్సైజ్‌శాఖ అంచనా వేస్తోంది. దరఖాస్తు రుసుం రెండు లక్షలుగా ఉండడంతో రిస్క్ తీసుకోవడం ఇష్టం లేక ఆశావహులు హైకోర్టు నిర్ణయం కోసం వేచి ఉన్నారు. కేసు విచారణ రెండు వారాలకు వాయిదా వేయడంతో అప్పటికి 12 మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. బుధవారంతో దరఖాస్తులకు గడువు ముగుస్తుండడంతో ఈ నెల 7న కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ చేపట్టి మద్యం షాపులను కేటాయించనున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.విజయ బాపట్లలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. ఈ సమీక్షలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు, అసిస్టెంట్ ఈఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈఎస్, ఏఈఎస్‌లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కె. విజయ

భీమలింగేశ్వరుడికి సూర్యాభిషేకం

- అరుదైన ఘట్టాన్ని చూసి తరించిన భక్తులు

పంగులూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పంగులూరులోని శ్రీపార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సూర్యకిరణాలు స్వామివారి విగ్రహాన్ని తాకాయి. ఈ అరుదైన ఘట్టాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి చూసి తరించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. రథసప్తమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాస శుద్ధ సప్తమి, రథసప్తమి రోజున స్వామివారి విగ్రహాన్ని ఆదిత్య కిరణాలు తాకడం అద్భుతమని ఆలయ అర్చకుడు స్వామి తెలిపారు. వారం రోజులు ఉదయం 7 గంటల పది నిమిషాలకు సూర్యకిరణాలు నందీశ్వరుని తాకుతూ భీమలింగేశ్వరస్వామిపై ప్రసరిస్తాయన్నారు.



స్వామివారి విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు

దాచేపల్లి, గురజాల

పంచాయతీలకు పోస్టుల మంజూరు

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి, గురజాల నగర పంచాయతీలకు శాశ్వత పోస్టులను మంజూరు చేస్తూ మునిసిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్వ దాచేపల్లి గ్రామ పంచాయతీ నుంచి పంచాయతీ సెక్రె టరీ గ్రేడ్-2, 3, జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్, స్వీపర్ పోస్టులను రీడిజిగ్నేషన్‌పై అప్‌గ్రేడ్ చేశారు. పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్-2 పోస్టుని కమిషనర్‌గా, గ్రేడ్-3 పోస్టుని మేనేజర్‌గా, జూనియర్ అసిస్టెంట్ (నడికుడి)ని యూడీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రీడిజిగ్నేట్ చేశారు. బిల్ కలెక్టర్, స్వీపర్ పోస్టులను యథాతథంగా ఉంచారు.

జూనియర్ అసిస్టెంట్(దాచేపల్లి)ని అదే పేస్కేల్‌లో రిటైన్ చేశారు. ఈ విధంగా దాచేపల్లి నగర పంచాయతీలో 12 పోస్టులను రీడిజిగ్నేట్ చేశారు. గుర జాల నగర పంచాయతీలో గ్రేడ్-2 పంచాయతీ సెక్రెటరీని కమిషనర్‌గా, గ్రేడ్-4 సెక్రెటరీని మేనేజర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. జూనియర్ అసి స్టెంట్(గురజాల)ని అదే పేస్కేల్‌పై జేఏఈగా రిటైన్ చేశారు. మరో జేఏని యూడీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. బిల్ కలెక్టర్‌ని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. స్వీపర్, నైట్‌వాచ్ మెన్‌లను అదే పేస్కేల్‌పై రిటైన్ చేశారు. ఈ విధంగా మొత్తం 10 పోస్టులను గురజాల నగర పంచాయతీకి మంజూరు చేశారు.

రైతు ఆత్మహత్యాయత్నం

పిడుగురాళ్ల ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) కుటుంబ వివాదంలో నడుస్తున్న నిషేధిత భూమిని ఆన్‌లైన్‌లో చేర్చాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్న ఓ రైతు రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మంగళ వారం జరిగింది. రాజుపాలెం మండలం కోటనెమలిపురికి చెందిన రమణారెడ్డి, పెద్దిరెడ్డి సమీప బంధువులు. పిడుగురాళ్ల మండలం కోనంకి పరిధిలో కొంత నిషేధిత భూమి ఉంది. ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని ఒకరు, ఉన్న పేరును తీసివేయాలని ,మరొకరి మధ్య కొన్నేళ్లుగా పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో ఈ వివాదం కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో రమణారెడ్డి మంగళవారం మద్యం తాగి పిడుగురాళ్ల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు యత్నించాడు. ఈ లోగా అక్కడున్న సిబ్బంది, మరికొందరు రమణా రెడ్డిని అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పిడుగురాళ్ల తహసీల్దారు మధు బాబు వివరణ ఇస్తూ, ఆ భూమికి సంబంధించి కుటుంబ సమీప బంధువుల మధ్య వివాదం జరుగుతోందని చెప్పారు. అది నిషేధిత భూమి జాబితాలో ఉండటం వలన ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇప్పుడు ఏమీ చేయడం సాధ్యం కాదని తెలిపారు.



రూ.16.95 లక్షల విలువైన 17 బైకులు స్వాధీనం

- ముగ్గురు ద్విచక్ర వాహన చోరుల అరెస్టు
- నిందితుల్లో వినుకొండకు చెందిన మహిళ
- అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్



అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో ఏఎస్పీ రవికుమార్, డీఎస్పీ మురళీకృష్ణ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పరి సర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న ముఠాను మంగళ గిరి పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మంగళగిరి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ నిందితుల వివరాలు వెల్లడించారు. గుంటూరులోని గుజ్జనగుండ్ల సెంటరుకు చెందిన నిసనం సతీశ్, స్వర్ణభారతినగర్‌కు చెందిన పేర్ల వినోద్, విను కొండ ఫైర్‌స్టేషన్ బజారుకు చెందిన షేక్ గౌస్యలు ముఠాగా ఏర్ప డ్డారు. మంగళగిరి పట్టణం, మండలం, తాడేపల్లి, విజయవాడ పరి సర ప్రాంతాల్లో సంచరిస్తూ ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నారు. గౌస్య ప్రస్తుతం సతీశ్‌తో సహజీవనం చేస్తూ బైకు చోరీలకు పాల్పడు తోంది. సతీశ్, గౌస్యలు ఒక మోటారు సైకిల్‌పై వచ్చి అర్ధరాత్రి దాటిన తరువాత తమ వాహనాన్ని ఓ చోట నిలిపి వుంచి చోరీ చేయదలచుకున్న మోటార్ సైకిల్‌ను మారు తాళం ద్వారా స్టార్ట్ చేసి ఉడాయిస్తుంటారు. మర్నాడు వచ్చి ఎవరికీ అనుమానం రాకుండా తమ వాహనాన్ని తీసుకు వెళుతుంటారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరి జ్ఞానం సహకారంతో మంగళవారం ఉదయం ముగ్గురు నిందితులు కాజ టోల్ ప్లాజా సమీపంలో వున్నట్టు గుర్తించి అదుపులోకి తీసు కున్నారు. నిందితులను విచారణ చేయగా గుంటూరు జిల్లా పరి ధిలో 16 బైకులు, విజయవాడ కృష్ణలంక ప్రాంతంలో ఒక బైకు దొంగిలించి నట్టు తేలింది. స్వాధీనం చేసుకున్న బైకుల విలువ సుమారు రూ.16 లక్షల 95 వేలు వుంటుందని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హ్యాండిల్ లాక్‌తోపాటు వీల్ లాక్ కూడా వేసు కోవాలని, సాధ్యమైనంత వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో వాహ నాలను పార్కింగ్ చేయాలని, వీలైతే బైకులకు జీపీఎస్ పరికరాన్ని అమర్చుకోవాలని రవికుమార్ సూచించారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, తాడేపల్లిలో ఇప్పటికే కార్డెన్ సెర్చ్ నిర్వహించామని, మంగళగిరిలో కూడా గంజాయి ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహిస్తామని వెల్లడిం చారు. నిందితులు నేర ప్రవృత్తిని వీడకుంటే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో మొత్తం 19 మందిపైన, మంగళగిరిలో ఇద్దరిపైన పీడీ యాక్టులు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, పట్టణ, రూరల్ సీఐలు డి.వినోద్ కుమార్, వై.శ్రీనివాస రావు, పట్టణ ఎస్ఐ బి.రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

టీడీపీ స్థలం ఆక్రమణ కేసులో నిందితుల అరెస్టు

బాపట్ల,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన ఘ టనలో నిందితులను బాపట్ల పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రామాంజనేయులు మంగళవారం విలే కరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసు వివరాలు వెల్లడించారు. డీఎ స్పీ మాట్లాడుతూ పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌లో సర్వే నంబరు 969-1లో 9 1/2 సెంట్ల స్థలంలో టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం తెలుగుదేశంపార్టీ అభిమాని ముప్వా సుబ్బారావు తనయుడు హరీష్ విరాళంగా నారా చంద్రబాబునాయుడు పేరుతో 2000 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అయితే, 2010 సంవత్స రంలో ఆ భూమిని బాపట్ల పట్టణం వెంగళ్‌విహార్‌కు చెందిన మార్పు నిర్మలాదే వి ఆమె కుమారుడు మార్పు సతీష్‌కు నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ విషయంలో అప్పటి తహసీల్దార్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కొంతకాలం త ర్వాత మళ్లీ నకిలీ పత్రాలను ఒరిజనల్ పత్రాలుగా చూపించి పలు దఫాలుగా 7సార్లు అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై తెలుగుదేశంపా ర్టీ పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన 9 మందిని గుర్తించామన్నారు. వీరి లో కారుమూరి సత్యవేదం, బుడ్డి శ్రీనివాసరావు, నక్కల శ్రీనివాసులు, నక్కల ల లిత, కోట శివారెడ్డి, ఉప్పాల కోటేశ్వరరావు, నక్కల సత్తార్‌రెడ్డి, నందనం నరసిం హారావులను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుల ఉన్న అక్రమ రిజిస్ట్రేషన్ ప త్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా భూములు స్వాధీనం చేసుకుంటే చర్యలు తప్పవని, స్థలం విషయాలలో ఎవరైనా భయపెడుతుంటే పోలీసులను సంప్రదిస్తే, విచారణ చేసి న్యాయం చేస్తామని తెలిపారు. సమా వేశంలో పట్టణ ఎస్ఐలు విజయ్‌కుమార్, చంద్రావతి పాల్గొన్నారు.



గుంటూరులోని రైల్ వికాస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం రామకృష్ణ, ఏడీఆర్ఎం, సీనియర్ డీఈఈ తదితరులు

ఏడాది ఆఖరుకు వంద శాతం రైలుమార్గాల విద్యుద్దీకరణ

- డీఆర్ఎం ఎం రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 96 శాతం రైలు మార్గాల విద్యుద్దీకరణ పూర్తి అయిందని, ఈ సంవత్సరం ఆఖరుకు 100 శాతం పూర్తి చేస్తామని డీఆర్ఎం ఎం రామకృష్ణ అన్నారు. భారతీయ రైల్వేలో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ అమలులోకి వచ్చి మంగళవారం నాటికి వందేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ 1925 ఫిబ్రవరి నెల 3 న తొలి ఎలక్ట్రిక్ లోకో రైలు బొంబాయి నుంచి కుర్లా వరకు నడిచిందన్నారు. ఈ నేప థ్యంలో దేశ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌ను స్మరించుకొంటూ కార్యక్రమాలను రైల్వే శాఖ నిర్వహిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో విద్యా ర్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు, 150 మంది రైల్వే సిబ్బందితో వాక థాన్ మంగళవారం ఉదయం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, గతిశక్తి సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఈ (ట్రాక్షన్) పీ రవితేజ, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

బాపట్ల ఫార్మసీ కళాశాల బృందానికి

ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ పేటెంట్ గ్రాంట్



గ్రాంట్ పొందిన అధ్యాపకురాలు సుకన్య

బాపట్లరూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల అ ధ్యాపకురాలు మానం సుకన్య, వారి పరిశోధన బృందం ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ పేటెంట్ గ్రాంట్ పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ టిఇజికె. మూర్తి తెలిపారు. 'లిపోసోమల్ ఫార్ములేషన్ యూసింగ్ లిపోయిక్ యాసిడ్ ఫర్ టార్గెటెడ్ డె లివరి ఆఫ్ యాంటీఆక్సిడాంట్స్' అనే అంశానికి సంబంధించి జర్మన్ పేటెంట్ గ్రాంట్ లభించినం దుకు ఆమెకు అభినందనలు తెలిపారు. సుకన్య మాట్లాడుతూ తన పీహెచ్‌డీ గైడ్ విద్యాధార, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణమూర్తి విలువైన సల హాలు, సూచనలు,ప్రోత్సాహంతో పరిశోధనలలో మెరుగ్గా రాణించగలు గుతున్నట్లు చెప్పారు.

తన పరిశోధనలలో భాగంగా ఇటీవల వీవీఐపీఎస్, గుడ్లవల్లేరు కా లేజీలో జరిగిన జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో 'ఇంపాక్ట్ ఆఫ్ ఫెనుగ్రీక్ ఆయిల్ ఆన్ సిటాగ్లిప్టిన్ ఫార్మాకోకినేటిక్ అండ్ ఫార్మాకోడైనమిక్ ప్రొ ఫైయిల్-ఎ కంప్యూటేషనల్ డాకింగ్ స్టడీ-2 కో-రిలేట్ బ్లడ్ గ్లూకోజ్ లె వెల్' అనే అంశంపై ఓరల్ ప్రజంటేషన్ విభాగంలో ద్వితీయ బహు మతి పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొ సైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.



విద్యార్థిని ఆర్ కళా జ్యోత్స్నను అభినందిస్తున్న విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో మేఘన, వైస్‌చాన్స్‌లర్ నాగభూషణ్ తదితరులు

'విజ్ఞాన్' విద్యార్థినికి తైక్వాండోలో బంగారు పతకం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి) : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థినికి తైక్వాండోలో జాతీయ స్థాయి బంగారు పతకం సాధించిందని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీలో రెండో సంవత్స రం సీఎస్ఈ చదువుతున్న విద్యార్థిని ఆర్ కళాజ్యోత్స్న ఈ పతకం సాధించినట్లు చెప్పారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసి యేషన్ హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన 40వ జాతీయ సీనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2024-25లో ఆమె పాల్గొన్నట్లు తెలిపారు. ఫైనల్లో కర్ణాటక రాష్ట్రం తరఫున పాల్గొన్న విద్యా ర్థినిపై మొదటి రౌండ్‌లో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాజ్యోత్స్నను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అభినందించారు.

ఆరోగ్య సిబ్బందికి పాప్‌స్మియర్, మెమోగ్రామ్ పరీక్షలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కేన్సర్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం కేన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒమేగా కేన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్క్రీ నింగ్ శిబిరం జరిగింది. డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ స్క్రీనింగ్ శిబిరంలో ఒమేగా హాస్పిటల్‌కు చెందిన సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ ఎంజీ నాగ కిషోర్, రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ పీ గీతా రుక్మిణి, ఇతర అంకా లజీ వైద్య నిపుణులు నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ పరీక్షలు జరిపారు. 52 మంది మహిళలకు పాప్‌స్మియర్ పరీక్షలు, 35 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వాస్పత్రిలో అగాహన ర్యాలీ..

వరల్డ్ కేన్సర్ డే పురస్కరించుకొని గుంటూరు వైద్యకళాశాల నాట్కో కేన్సర్ సెంటర్ నుంచి నగరంలో మంగళవారం వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రి కేన్సర్ వైద్యులతో పాటు చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థులు నగర ప్రధాన కూడళ్లల్లో ర్యాలీ నిర్వహించారు. కేన్సర్‌పై అవగాహన కల్పించేలా విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం శుశృతహాల్‌లో నర్సింగ్ సిబ్బం దికి కేన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. 'కేన్సర్‌ను అరికడదాం' అనే నినాదంతో గుంటూరు వైద్యకళాశాలకు చెందిన 500 మంది వైద్య విద్యార్థులు మంగళవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జీఎంసీ నుంచి ప్రారంభమైన ర్యాలీ జిల్లా కోర్టు, మీదుగా మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా సెంటర్‌కు చేరుకుంది.

కౌలు రుణాలు..తీసికట్టు

(5వ పేజీ తరువాయి)

రూ.8,306 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాలలో ఇప్పటికే 90 శాతం చేరుకున్నట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియబోతున్నందున అప్పటికి వంద శాతం లక్ష్యాలను చేరుకుంటామనే ధీమాను బ్యాంకర్లు వ్యక్తం చేస్తు న్నాయి. ఇన్ని వేల కోట్ల పద్దులో కౌలు రైతులకు దక్కిన వాటా పరి శీలిస్తే విస్తుపోవాల్సిందే.

ప్రణాళికా లోపం.. నిబంధనల శాపం

సీసీఆర్‌సీ కార్డుల కాల వ్యవధి పదకొండు నెలలే. వీటి జారీని మే నుంచి ఏప్రిల్ వరకు మాత్రమే ఇస్తారు. ఇవి కౌలు రైతులకు అందేసరికే జూలై, ఆగస్టు నెలలు వస్తున్నాయి. అప్పటికే ఇచ్చిన వ్యవధిలో రెండు నెలలు గడిచిపోతుంది. బ్యాంకర్లు పెట్టే నిబంధనలకు అటువైపు కన్నెత్తి చూడాలంటేనే రైతులు భయపడాల్సిన పరిస్థితి. ఇక భూ యజమానులకు అవగాహన లేక కౌలు చేసుకునే రైతులకు రుణాలు అందించడానికి సుముఖత వ్యక్తం చేయడంలేదు. పైగా వారే రుణాలు తీసుకోవడం కూడా కౌలు రైతులకు ప్రతిబంధకంగా మారు తోంది. ఇదేకాకుండా ఏటికేడు కౌలు చేసుకునే రైతులు మారుతుండ డంతో వారు కట్టకపోతే ఆ మొత్తం తమ నెత్తిన పడుతుందనే భయంతో యజమానులు వెనుకంజ వేస్తున్నారు.

ఇవేకాకుండా అధి కారుల వైపు నుంచి రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి కొరవడింది. ఆర్థిక సంవత్సరం ముగింపులో హడావిడిగా భూ యజమానులకు అవ గాహన సదస్సులు నిర్వహించడం లాంటి మొక్కుబడి కార్యక్రమాలతో సరిపెడుతున్నారు. నిజానికి సేద్యం రుణ పద్దులో పదిశాతం కౌలు రైతుల వాటాగా ఉండాలనే డిమాండ్‌ను రైతు సంఘాలు ఎప్పటి నుంచో చేస్తున్నాయి. కానీ ప్రసుతం తీసికట్టుగా నిర్దేశించుకున్న పదుల కోట్ల రుణాలే రైతుల చెంతకు చేరని దయనీయ పరిస్థితి కనబడుతోంది. ఇక పదిశాతం వాటా ఎప్పటికి దక్కేను అని కౌలు రైతులు వాపోతున్నారు.



పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ బాబు, మ్యాని, శామ్యూల్ కిరణ్ తదితరులు. ఇన్‌సెట్‌లో ప్రమీల సెల్వరాజ్ (ఫైల్)

బైబిల్ మిషన్ స్త్రీల సభల కన్వీనర్ ప్రమీలా సెల్వరాజ్ మృతి

పెదకాకాని, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): బైబిల్ మిషన్ స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థన నిర్వాహకురాలు డాక్టర్ జె. ప్రమీలా సెల్వరాజ్ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడు తున్న ఆమె, గుంటూరు లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం ఆమె తుదిశ్వాస విడిచారు. భక్తుల సంద ర్శనార్థం ప్రమీలాసెల్వరాజ్ పార్థివ దేహాన్ని కాకాని స్వస్థతశాలకు తర లించారు. మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అధికసంఖ్యలో ప్రముఖులు, సేవ కులు, భక్తులు హాజరై నివాళులర్పించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మాను యేలు నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూటమి జరుగుతుందని బైబిల్ మిషన్ అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా కోరారు.

'అమరావతిని అడ్డుకోవడమే లక్ష్యంగా సాగిన జగన్ పాలన'

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో అమరావతి అభి వృద్ధిని అడ్డు కోవడమే లక్ష్యంగా జగన్ పాలన సాగిందని టీడీపీ జిల్లా అధ్య క్షుడు తెనాలి శ్రావణ్‌కు మార్ విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాల నలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుపడిం దని, మూడు రాజధానుల పేరుతో అమరావతి రాజధాని నిర్మాణ పనులను నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి మునిగిపోతుందని అసత్యమైన ప్రచారాలు చేశారని, అమరావతి అడవిని తలపిస్తుందని, శ్మశానం అంటూ కూడా ఇష్టారీతిన మాట్లాడారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. వర్షాలు, వరదలకు అమరావతి పక్కన ఉన్న విజయవాడ బుడ మేరు పొంగింది. ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలు మునిగిపోయాయి కానీ అమరావతిలో చిన్న నష్టం కూడా జరగలేదని చెప్పారు. అమరావతి నిర్మాణం జరగ కుండా అడ్డుకోవడమే జగన్ లక్ష్యంగా ఐదేళ్ల పాలన కొనసాగిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతి నిధి దామచర్ల శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 549.30 అడుగులు ఉంది. ఇది 208.23 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9833 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353 క్యూసెక్కులు, ప్ర ధాన జలవిద్యుత్ కేంద్రం ద్వా రా 20,384 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎ ల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కు లు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 40,050 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇ న్‌ఫ్లో వాటర్‌గా 29,874 క్యూసె క్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,13,256 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,17, 126 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1, 13,256 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 77,914 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13800	334	--	--
నెంబరు. 5	11000	12500	నెంబరు.5	--	--
273	10700	11000	273	--	--
341	10000	15500	341	--	--
4884	9700	12000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	10500	11000
బ్యాడిగి	10000	12500	బ్యాడిగి	10000	12000
దేవనూరు డీలక్స్	10000	12500	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	--	--	తెల్లకాయలు	--	--

వైభవంగా భద్రావతి సమేత భావనరుషి స్వామి కల్యాణం

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : భద్రావతి సమేత భావనరుషి స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భట్టిప్రోలులోని భావనరుషి స్వామి దేవాలయ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆకురాతి వెంకటేశ్వర రావు, రాధా దంపతులు కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. పోలన శివయ్య సిద్ధాంతి కల్యాణం, పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కె.హనుమంతరావు, కె.శివనాగేశ్వరరావు, బి.వెంకట శివయ్య, సీహెచ్ మనోహర్ పాల్గొన్నారు.

పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

బాపట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘ పరిధిలోని 1, 7, 12, 19, 25వ వార్డులలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పట్టణం మొత్తం పారిశుధ్యం మెరుగుపడేవిధంగా ఒక ప్రణాళిక రూపొందించి తదనుగుణంగా పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైనేజీలలో పూడికతీత పనులు, దోమల నియంత్రణకు ఫాగింగ్ నిర్వహించటం, రోడ్ల మార్జిన్‌లో పిచ్చిమొక్కల తొలగింపు, లార్వా నియంత్రణకు ఆయిల్‌బాల్స్‌ను ఈ ప్రత్యేక డ్రైవ్‌లో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌పై అవగాహన కల్పించండి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ

బాపట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హెల్మెట్ నిబంధనల అమలులో చలానాల వసూళ్ళు కంటే ప్రజలలో అవగాహన పెంచటానికి ప్రాధాన్యతనివ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం పోలీసులు జరిమానాలు వేస్తూ కఠినంగా అమలు చేస్తున్న తీరు ప్రజలలో అసంతృప్తిని కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం, సంబంధితాధికారులు ప్రజలను ఒత్తిడికి గురిచేయకుండా మొదట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యత కలిగిన హెల్మెట్‌లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మినుము పంట ధ్వంసం చేసిన ఆవుల మంద

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆవుల మంద కారణంగా మినుము పంట ధ్వంసం అవుతుందని రైతులు వాపోతున్నారు. భట్టిప్రోలు అద్దేపల్లి శివారులోని పొలాల్లో పది ఆవులు మినుము పొలాల్లో తిరుగుతూ పంటను మేతగా తీసుకోవడంతో పాటు పంటలో తిరగడం వల్ల పూత, పిందె మీద ఉన్న పంట మొత్తం దెబ్బతినిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవుల మంద కారణంగా రబీలో రూ.25 వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన మినుము పంట సుమారు 20 ఎకరాలకు పైగా దెబ్బతిందని రైతులు చెబుతున్నారు. పశు యజమానులను గుర్తించి వారిని హెచ్చరించి తమ పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

బెల్టు షాపులపై దాడులు

వేమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.విజయ ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి మండలంలోని చావలి గ్రామంలో వ్యక్తి నుంచి 14 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని వేమూరు ఎక్సైజ్ శాఖ సీఐ రవికుమార్ తెలిపారు. వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రామారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

అమృతలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్నారై గడ్డిపాటి కళ్యాణి అన్నారు. పాఠశాల ఆవరణలో అభివృద్ధి చేసిన సరస్వతీదేవి విగ్రహం, గార్డెన్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో తమ తాత గడ్డిపాటి రామమోహనరావు, కస్తూరిదేవి దంపతులు జ్ఞాపకార్థం తమ వంతు సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గడ్డిపాటి నీలిమ, రాపర్ల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

'కోళ్ళకు వైరస్ సోకితే అమ్మరాదు'

రేపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని పౌల్ట్రీ రైతులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని కోళ్ళకు వైరస్ సోకితే అమ్మరాదని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు నాంచారయ్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైరస్ మూలంగా నాటుకోళ్ళు, బాయిలర్ కోళ్ళు ఎక్కువ సంఖ్యలో ఉమ్మడి గోదావరి జిల్లాలో చనిపోవటం జరిగిందని, వైరస్ నిర్ధారణ నిమిత్తం శాంపిల్స్‌ను వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, పూణేకు పంపటం జరిగిందని, ఫలితాల కోసం వేచి చూస్తున్నామన్నారు. కోళ్ళలో వైరస్ సోకిందని తెలిస్తే వాటిని అమ్మరాదని తెలిపారు. చనిపోయిన కోళ్ళను ఎట్టిపరిస్థితుల్లో తినకూడదని హెచ్చరించారు. చనిపోయిన కోళ్ళను కాల్చివేయటం లేదంటే మూడడుగుల గొయ్యి తీసి పాతిపెట్టాల్సిందిగా కోరారు. వదంతులను నమ్మకుండా ఆరోగ్యంగా ఉన్న కోళ్ళను, కోడిగుడ్లను తినవచ్చని, వైరస్ మనుషులకు, పశువులకు సోకినట్లుగా నిర్ధారణ కాలేదని తెలిపారు.

పొలం సర్వే చేసి న్యాయం చేయాలని వినతి

కొల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తన పొలాన్ని సర్వే చేసి అప్పగించి న్యాయం చేయాలని బాధితులు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. మండల పరిధిలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన మరీదు ప్రసాద్ దంపతులు మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలుసుకుని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమపై దౌర్జన్యం చేసి పంటను ధ్వంసం చేసి రోడ్డు వేశారని, తన భూమి కొలతలు వేసి తనకు అప్పగించి న్యాయం చేయాలని తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

● ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి గెలుపునకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, భట్టిప్రోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధమై కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ ఎన్నికలపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా రాజేంద్రప్రసాద్ ఈనెల 7వ తేదీన గుంటూరులో నామినేషన్ వేయనున్నారని, కార్యక్రమానికి వేమూరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. అదేవిధంగా ఆయన గెలుపు కోసం ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రచారంలో ఎలక్షన్ కోడ్ ముగిసిన అనంతరం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల గురించి, ప్రభుత్వం ఇచ్చిన హామీ పథకాల అమలు, రాష్ట్రాభివృద్ధి కోసం తీసుకువచ్చిన కంపెనీలను వివరించి చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గాల అబ్జర్వర్, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తక్ అహ్మద్, కొల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, భట్టిప్రోలు మండల అధ్యక్షుడు వాకా శేషబాబు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి గల్లా వెంకట కోటేశ్వరరావు, కొల్లూరు మండల జనసేన కన్వీనర్ బొందలపాటి చలమయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నగదును ఐవిడా సంస్థ నిర్వాహకురాలు సుమకు అందజేస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరావు

అంధుల సంగీత విభావరికి ముగ్ధులైన విద్యార్థులు

● తమవంతు సాయంగా రూ.1,23,700 నగదు విరాళం

కొల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంధులు నిర్వహించిన సంగీత విభావరికి విద్యార్థులు మంత్ర ముగ్ధులయ్యారు. హైదరాబాద్‌కు చెందిన ఐవిడా సంస్థ ఆధ్వర్యంలో గత నెల 29న కొల్లూరులోని శ్రీచైతన్య విద్యావిహార్ పాఠశాలలో అంధుల సంగీత విభావరి నిర్వహించారు. వారి ప్రతిభా పాటవాలకు పరవశించిన విద్యార్థులు స్వచ్ఛందంగా మంగళవారం ఈ భూరి విరాళం రూ.1,23,700 నగదును పాఠశాల డైరెక్టర్ పావులూరి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఐవిడా సంస్థ నిర్వాహకురాలు సుమకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ తరపున విద్యార్థులకు, పాఠశాల యాజమాన్యం, సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విజేత విద్యాలయం విద్యార్థుల చేయూత

రెడ్డిపాలెం (పిట్టలవానిపాలెం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపాలెం సెంటర్‌లో గల విజేత విద్యాలయంలో అంధ విద్యార్థులు, కళాకారులకు ఆర్థికసాయం నిమిత్తం విద్యార్థులు సమకూర్చిన రూ.90,799ను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాసరావు చేతులమీదగా సంస్థ నిర్వాహకురాలు సుమకు అందజేశారు.

'మహాప్రస్థానం' నేటి యువత పఠించాలి

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహాప్రస్థానాన్ని నేటి యువత పఠించి స్ఫూర్తి పొందటం ఎంతైనా అవసరమని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. ఫోరం ఫర్ బెటర్, బాపట్ల ఆధ్వర్యంలో మహాప్రస్థానం 75 వసంతాలు సందర్భంగా శ్రీశ్రీ సాహిత్యనిధి వారి ప్రచురించిన జ్వాలతోరణం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా ఈ పుస్తకావిష్కరణకు విఠలేశ్వర్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం తెలుగు సాహిత్య రంగాన్ని కుదిపివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్, బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, విజయవాడ శ్రీశ్రీ సాహిత్య అధినేత, కవి సింగంపల్లి అశోక్‌కుమార్, చిత్రకారుడు జీవీ, ఉపాధ్యాయులు ఎస్.రామకృష్ణ, అబ్దుల్ కలాం, గురజాల శ్రీనివాసరావు, ఇక్కుర్తి శ్రీనివాస్, పిన్నిబోయన శ్రీమన్నారాయణ, ఎం.ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

అల్లూరులో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఫౌండర్ ఫజల్ రహమాన్, వైద్యులు శ్రీనివాస్

అల్లూరు (పిట్టలవానిపాలెం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో బడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ, హెల్త్ కేర్ మెడికల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం పొన్నూరుకు చెందిన బాలాజీ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అమృత గరికపాటి, డాక్టర్ రేణుకుమార్, డాక్టర్ షేక్ అస్మా, దంత వైద్యనిపుణులు డాక్టర్ గాయత్రి స్పందన పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు సొసైటీ ఫౌండర్, ప్రెసిడెంట్ షేక్ ఫజల్ రహమాన్, ఆర్గనైజర్ జి.శ్రీనివాసు సంయుక్తంగా తెలిపారు. ఈ సందర్భంగా బడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ ఫౌండర్ షేక్ ఫజల్ తల్లిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గ్రామీణ వైద్యులు రామాచార్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.పద్మారావు, అల్లూరు గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మావతి, బాలాజీ హాస్పటల్, అల్లూరు హెల్త్ కేర్ మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి : ఎంపీడీవో

కర్లపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో ఉన్న విద్యార్థులందరికి నాణ్యమైన విద్యనందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదగొల్లపాలెం తుమ్మలపల్లి గ్రామాలలో ఎంపీడీవో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు విధులపై అప్రమత్తంగా ఉండాలని, మెరుగైన సేవలందించాలని సూచించారు. ఉపాధ్యాయులు నాగరాజు, మల్లికార్జునరెడ్డి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

అమృతలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడికి టీడీపీ నాయకులు మంగళవారం రాత్రి ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని ఇంటూరు గ్రామానికి చెందిన తాళ్ళపల్లి సీతారామయ్య పూరిళ్లు ఇటీవల అగ్నికి ఆహుతైంది. దీంతో టీడీపీ తరుపున సాగునీటి సంఘం అధ్యక్షుడు బోరుగడ్డ శామ్యూల్, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు పాములపాటి వెంకట సుబ్బారావు, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోరుగడ్డ ఆనంద్ కలసి రూ.56 వేలను సీతారామయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ లక్ష్మీప్రసాద్, పోతుపాలేపు శ్రీనివాసరావు, సుభాని, ఘంటా రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి : తన్నీరు

చుండూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఉన్నత ఎదుగుదలకి వారిని పాఠశాల స్థాయి నుండే భుజం తట్టి ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో అనుకున్న లక్ష్యాలు చేరుకుంటారని తన్నీరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ అన్నారు. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఎగ్జామ్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తన్నీరు శ్రీనివాస్, నాని, హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు సుబ్బారావు, శ్రీనివాసరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 8640 మంది ఓటర్లు

● నియోజకవర్గంలో 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

● ఎన్నికల అధికారి సుశీల



ఎన్నికల అధికారి సుశీల

వేమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తంగా వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 8640 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి సుశీల తెలిపారు. ఆమె మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 5177 మంది పురుషులు, 3461 మంది స్త్రీలు, ఇతరులు ముగ్గురు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా గుర్తించడం జరిగిందన్నారు. చుండూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల పరిధిలో 1598 మంది, అమృతలూరు మండలం ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల పరిధిలో 1577 మంది, వేమూరు మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రాలలో 1654 మంది, కొల్లూరు మండలంలో రెండు ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాల పరిధిలో 1839 మంది, భట్టిప్రోలు మండలంలో రెండు ఉన్నత పాఠశాలల పోలింగ్ కేంద్రాల పరిధిలో 1972 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించే విధంగా ముందస్తుగానే చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

ప్రజా సమస్యలను అధికారులు పరిష్కరించాలి

● మండల ఉపాధ్యక్షుడు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు రాంబాబు

కొల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార దిశగా అధికారులు పని చేయాలని మండల ఉపాధ్యక్షుడు మురాల రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు అధికారులకు ఆయా గ్రామాల్లో సమస్యలు గురించి చెప్పినా పట్టించుకోకుండా పెడచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజుల్లంక ఎంపీటీసీ బావిరెడ్డి వెంకట్రామయ్య, ఆవులవారిపాలెం రహదారిపై నిత్యం వందలాది లారీలు, ట్రాక్టర్లు తిరగడం వల్ల దుమ్ము, ధూళి లేస్తుందని, ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లించి ధూళి కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలన్నారు. అలాగే కొల్లూరు లాకు సెంటర్‌లో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం, ముగిసిన సమయాల్లో ట్రాఫిక్ నిలిచిపోయి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆయా సమయాల్లో ఒక కానిస్టేబుల్‌ను నియమించి ట్రాఫిక్ సమస్యలు నివారించాలని సూచించారు. పలువురు సభ్యులు ఆయా సమస్యలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో కె.నరసింహారావు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ సునీత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కారవంతమైన విద్యను అభ్యసించాలి

● జ్ఞాన ప్రసూనాంబ ట్రస్ట్ అధ్యక్షుడు కృష్ణరాయలు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న కృష్ణరాయలు

వేమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోటీతత్వంతో మంచి మార్కులు సాధించడంతో పాటు సంస్కారవంతమైన విద్యను అభ్యసించాలని గవిని జ్ఞాన ప్రసూనాంబ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణరాయలు అన్నారు. మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞాన ప్రసూనాంబ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు డి.భాగ్యమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా ట్రస్ట్ విరాళం రూ.లక్షన్నర రిటైర్డ్ ఉపాధ్యాయిని పరుచూరి విద్యారాణి తమ తల్లిదండ్రులు సాంబశివరావు, సరళాదేవి జ్ఞాపకార్థంగా అందించిన రూ.1,25,000 విరాళంతో స్టేజీ నిర్మాణం జరిపారు. దాతల చేతుల మీదుగా ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో కృష్ణరాయలు మాట్లాడుతూ గ్రామానికి, దేశానికి సేవ చేయాలన్న ఆలోచనతో విద్యార్థులు భవిష్యత్‌కు మార్గం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాత విద్యారాణి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరు మీదుగా స్టేజీ, నిర్మాణానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివయ్య, పోతురాజు, శ్రీనివాస్‌కుమార్, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు పర్మినెంట్ రైతు నమోదు పత్రం పొందాలి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరుంబాక, కావూరు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎంఏవో అవ్వారు మహేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలు ఈ-పంట, ఈకేవైసీ గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రేపల్లె ఏడీఏ ఆర్.విజయబాబు మాట్లాడుతూ మండలంలో 30 శాతం మాత్రమే ఈకేవైసీ జరిగిందని, రైతులందరూ తప్పక చేయించుకోవాలన్నారు. రైతు నమోదు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభించామని ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టిన కార్యక్రమానికి అందరూ రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకుని యూనిక్ నెంబర్ కలిగిన పర్మినెంట్ రైతు నమోదు పత్రం పొందాలన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామసహాయకులు, జడ్‌బీఎన్ఎఫ్ ప్రతినిధులు, ఏఈవోలు మాధవి, తిరుపతమ్మ, ప్రియాంక, ప్రేమ్‌కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం తహసీల్దార్‌గా వెంకటేశ్వరరావు



తహసీల్దార్ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ మండల నాయకులు

పిట్టలవానిపాలెం,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్‌గా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ధూళిపూడి వెంకటేశ్వరరావును టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. తహసీల్దార్‌ను అభినందించిన వారిలో మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన నారాయణ, పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండి అఫ్జల్, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, జి.నరసరాజు, సుబ్బరాజు, మురళీరాజు, పలువురు గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

పెనుమూడి పుష్కర్‌ఘాట్‌లో పిచ్చిచెట్లు తొలగింపు

● మద్యం సీసాలు, వ్యర్థాలు ఏరివేత



పెనుమూడి పుష్కర్‌ఘాట్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

రేపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : 'మందుబాబులకు అడ్డా.. పుష్కరఘాట్' అని 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పెనుమూడి పుష్కర్‌ఘాట్‌లో మద్యం సీసాల ఏరివేతతో పాటు పిచ్చిమొక్కలను, వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. నిత్యం కర్మకాండలు చేసుకునేందుకు రేపల్లె, కృష్ణా జిల్లా, బాపట్ల, పొన్నూరు తదితర ప్రాంతాల నుంచి వస్తుంటారు. పుష్కరఘాట్ అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురౌవుతున్నారు. పంచాయతీ సెక్రటరీ ఎండీ అబీద్‌హుస్సేన్ స్పందించి పది మంది పారిశుధ్య కార్మికులతో పుష్కరఘాట్‌లో ఉన్న వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. పుష్కర్‌ఘాట్‌లో అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై పోలీస్ కేసులు పెట్టనున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జంపని చెన్నకేశవాలయంలో సూర్య నమస్కారాలు చేస్తున్న భక్తులు

వైభవంగా రథసప్తమి పూజలు

వేమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి పర్వదిన పూజలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఉదయం సూర్యనారాయణ అష్టకం పారాయణ జరిపారు. అనంతరం స్వామి వారి లోహమూర్తికి పంచామృతాభిషేకం చేసి పంచసూక్తాలను పఠించారు. స్వామి వారి చిత్రపటం వద్ద శాస్త్రబద్ధంగా చిక్కుడుకాయలతో రథం తయారు చేసి రంగవల్లులపై ఉంచి ఆగమ శాస్త్ర ప్రకారం విశేష అర్చన జరిపారు. భక్తుల చేత అష్టోత్తర శతనామ పూజ చేయించి సూర్యభగవానునికి అర్ఘ్యం సమర్పించిన అనంతరం సూర్యస్తోత్రాన్ని పఠిస్తూ భక్తులు సూర్యనమస్కారాలు చేశారు. కంఠమనేని వంశీకృష్ణ, సూరిబోయిన సుబ్బయ్య, పొట్టి శ్రీనివాస్ దంపతులు వార్షిక పూజకు ప్రధాన కర్తలుగా పాల్గొన్నారు. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ జరిపారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

నగరం మండలంలో...

నగరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. వివిధ ఆలయాలలో స్వామివారికి అభిషేకాలు, జలబిందులు, అర్చనలు, ఊరేగింపులు నిర్వహించారు. సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గిరిపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో, ధూళిపూడిలోని తాళ్ళమ్మతల్లి, ఏలేటిపాలెంలోని మద్దిరాలమ్మతల్లి ఆలయంలో, జిల్లేపల్లి, పూడివాడ వేణుగోపాలస్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సూరేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సకాల జీవరాశికి ఆధారం సూర్యభగవానుడేనని ప్రధానోపాధ్యాయుడు కూచిబొట్ల శ్రీనివాసశర్మ అన్నారు. రథసప్తమి పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని సూరేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ సూర్య నమస్కారాలు, ఆసనాలు వల్ల మంచి ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, ఉపాధ్యాయులు పి.అనిల్‌కుమార్, శ్యామకుమారి, జయలక్ష్మి, నరసింహారావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకాఫాస్టర్ పాఠశాలలో ...

బాపట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివేకాఫాస్టర్ పాఠశాలలో మంగళవారం రథసప్తమి సందర్భంగా విద్యార్థులతో సూర్యనమస్కారాలను పాఠశాల ఉపాధ్యాయులు, హిందూ చైతన్యవేదిక బాపట్ల సంయోజక్ బెజవాడ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేయించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇలా సూర్యనమస్కారాలు చేయటం వలన ఆరోగ్యప్రదాత సూర్యభగవానుడి అనుగ్రహంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు.

భట్టిప్రోలులో...



రథసప్తమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాఘ శుద్ధ సప్తమి మంగళవారం రథసప్తమి సందర్భంగా బాలత్రిపుర సుందరి సమేత హేమవిఠలేశ్వర స్వామి దేవస్థానంలో సూర్యనారాయణ మూర్తికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. సూర్యభగవానుని ఆశీస్సుల కోసం బాలత్రిపురసుందరి మహిళా సమాజం సభ్యులు అర్చనలో పాల్గొన్నారు. అద్దేపల్లి చెందిన మహిళలు సూర్యరథంలో పాల్గొన్నారు. అనంతరం సూరి గాయత్రి హోమం నిర్వహించారు. సూర్యారాధన ఫలితాలను బూరెల అరుణ్‌కుమార్ వివరించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో...



రథసప్తమి సందర్భంగా భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

అల్లూరు (పిట్టలవానిపాలెం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారికి రథసప్తమి సేవా కార్యక్రమాలలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు తమవంతు సహాయ, సహకారాలను అందజేశారు.

వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాలలో క్యాన్సర్ డే

నగరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాల ఎన్ఎస్ఎస్ జువాలజీ ఆక్వాకల్చర్ విభాగాల ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్‌డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నగరం గవర్నమెంట్ హాస్పటల్ చీఫ్ సర్జన్ డాక్టర్ జీ.మధుప్రభాకరబాబు, డాక్టర్ ఎస్.దినేష్ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, అకాడమీ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాప్తి ఎక్కువగా ఉందని, దీని బారిన పడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే దీనిని జయించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి శివయ్య, డాక్టర్ సురేష్‌బాబు, వీవీ సాంబమూర్తి హాజరయ్యారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు
విస్తృత ఏర్పాట్లు

- 483 పోలింగ్ కేంద్రాలను ఈసీకి ప్రతిపాదించాం
- ఒక్కో పోలింగ్ బూత్‌కు ఐదుగురు సిబ్బందికి డ్యూటీలు
- సాధారణ ఎన్నికల వలే వెబ్ కాస్టింగ్, సీసీ టీవీ ఏర్పాట్లు
- 'ఆంధ్రజ్యోతి'తో కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఆర్‌వో నాగలక్ష్మి



గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సజావుగా జరుగుతున్నాయని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని మండలాల్లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటివరకు 3 లక్షల 46 వేల 614 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వారిలో 2,06,225 మంది పురుషులు, 1,40,344 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకుగాను 483 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం జరిగింది. 416 పోలింగ్ బూత్‌ల ఇదివరకే ఏర్పాటు చేయగా వెయ్యి ఓటర్ల సంఖ్య దాటిన కేంద్రాలకు అనుబంధంగా మరో 67 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘానికి ప్రతిపాదించడం జరిగింది. ఈసీ అనుమతి రాగానే వాటిని కూడా నోటిఫై చేస్తామని చెప్పారు. ఎన్నికల నిర్వహణపై ఆర్‌వో నాగలక్ష్మి మంగళవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్షన్ నోటిఫికేషన్‌ని ఈ నెల 3వ తేదీన ప్రకటించాం. ఇప్పటివరకు ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. రెండో రోజైన మంగళవారం నామినేషన్లు దాఖలు కాలేదన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, ఏలూరు జిల్లాకు సంబంధించి నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలతో పాటు బాపట్ల జిల్లాలోని వేమూరు, కొల్లూరు, చుండూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి, రేపల్లె, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాల్లో ఎలక్షన్ కోడ్ అమలులో ఉంటుందని ఆర్‌వో తెలిపారు. ఎన్నికల కోడ్‌ని సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళి వలే అమలు చేస్తున్నాం. రాజకీయ నాయకుల విగ్రహాలన్నింటికి ముసుగులు వేశాం. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించడం జరిగిందన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహణ కోసం జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి వారికి బాధ్యతలు కేటాయించడం జరిగింది. ఎన్నికలు నిర్వహించే పోలింగ్ స్టేషన్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని నోడల్ అధికారులను ఆదేశించాం. నిబంధనల మేరకు పోలింగ్‌స్టేషన్‌లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, పోలింగ్ గదులు విశాలంగా వుండి వెలుతురు బాగా వుండేటట్లు చూస్తున్నాం. ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా జరుగుతున్నందున బ్యాలెట్ బాక్సులను మరమ్మత్తులు చేపట్టి వాటికి బాగా ఆయిలింగ్ చేసి వివరాలు ఇవ్వాల్సిందిగా ఆదేశించామన్నారు. గతంలో వలే గుంటూరు నగరంలోని ఆంధ్ర క్రైస్తవ(ఏసీ) కళాశాలలో పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం ఒక ప్రణాళికని రూపొందించామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు సామాగ్రి తరలింపు, పోలింగ్ ముగిసిన తర్వాత రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొచ్చేందుకు రూట్ మ్యాప్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు.

ఒక్కో పోలింగ్ బూత్‌కు ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వారిలో ఒకరు ప్రిసైడింగ్ అధికారి కాగా, ముగ్గురు ఓపీవోలు, ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఇందుకోసం 2,415 మంది సిబ్బంది అవసరం అవుతారు. వీరికి అదనంగా మరో 25 శాతం రిజర్వు సిబ్బంది అవసరం. ఎన్నికల నిర్వహణలో అనుభవం ఉన్న అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నాం. కొద్ది రోజుల్లో ఎన్నికల డ్యూటీల నిర్వహణపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

బయో కెమిస్ట్రీ విభాగానికి
రాఘవశర్మ రూ.10 లక్షల విరాళం

● డాక్టర్ మోహనలక్ష్మి రూ.3 లక్షలు



డాక్టర్ సుందరాచారికి చెక్‌ను అందజేస్తున్న బయో కెమిస్ట్రీ వైద్యులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ విభాగంలో మెడికల్ పీజీ విద్యార్థులను పరిశోధన రంగంలో ప్రోత్సహించే క్రమంలో అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ రాఘవశర్మ రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఈ నిధులతో ఈ విభాగానికి అవసరమైన సెమి ఆటోమేటెడ్ హెలీనా ఎలక్ట్రో ఫ్లోరేసిస్, హెర్బా ఎలీజా రీడర్, హెలీనా కొయగ్లోమెట్రి పరికరాలను కొనుగోలు చేశారు. పలు రకాల కేన్సర్ వ్యాధుల నిర్ధారణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. పలు వైరస్ మార్కర్లను తెలుసుకోవచ్చు. బయోకెమిస్ట్రీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జె మోహనలక్ష్మి వ్యక్తిగతంగా రూ.3 లక్షలు ఇదే విభాగానికి విరాళం అందజేశారు. దీనితో వైద్య పరికరాలు, రిఫ్రిజిరేటర్, ఏసీ వంటివి కొనుగోలు చేస్తారు. డాక్టర్ రాఘవశర్మ అందజేసిన చెక్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారికి బయో కెమిస్ట్రీ వైద్యులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బయో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ నవనీత లక్ష్మి, డాక్టర్ మోహనలక్ష్మి, డాక్టర్ భానుకుమార్, డాక్టర్ మరియ కుమారి, డాక్టర్ ఇబ్రహీం పాల్గొన్నారు.

జీఎంసీకి డాక్టర్ లక్ష్మీ రజని రూ.10 లక్షలు..



వైద్య కళాశాలకు చేరిన కుర్చీలు

గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులు పరీక్ష హాల్‌లో కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు బల్లల కొనుగోలు కోసం ఎన్నారై డాక్టర్ నర్రం నేని లక్ష్మీరజని రూ.10 లక్షల విరాళం అందజేశారు. గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన ఆమె అనంతరం కొంత కాలం ఇంగ్లాండ్‌లో వైద్యురాలిగా పని చేశారు. ఇటీవల స్వస్థలమైన విజయ వాడకు వచ్చారు. గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల వార్షిక పరీక్షల్లో సౌకర్యవంతంగా కూర్చొని రాసేందుకు ఆధునిక కుర్చీలు, టేబుళ్ల కొనుగోలుకు రూ.10 లక్షల చెక్‌ను ఇటీవల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారికి అందజేశారు. ఈ నగదుతో 330 టేబుళ్లు, కుర్చీలను కొనుగోలు చేశారు. మంగళవారం అవి జీఎంసీకి చేరాయి. వీటిని పరీక్ష హాళ్లల్లో ఏర్పాటు చేయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

వైద్య విద్యార్థులకు ఏకరూప దుస్తులు

గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫారం) ప్రవేశపెట్టాలని వైద్యాధికారులు యోచిస్తున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎంఎన్‌సీ) నిబంధనల ప్రకారం ఫస్ట్ ఎంబీబీఎస్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు ధరించాలనే కోడ్ ఉంది. ఇది పెద్దగా అమలు కావడం లేదు. ప్రతి వైద్య విద్యార్థి తప్పనిసరిగా బూట్లు ధరించాలని, ఐడెంటిటి కార్డు ధరించాలని నిబంధనలు ఉన్నా ఇవీ అమలు కావడం లేదు. గుంటూరు వైద్య కళాశాలలో మెడిసిన్‌లో 250 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఫస్ట్ ఇయర్, సెకండియర్, థర్డ్ ఇయర్, ఇలా ఫైనలియర్ వరకు వెయ్యి మందికిపైగా మెడికోలు ఉన్నారు. వీరికి యూనిఫారం లేకపోవడంతో క్యాంపస్‌లో తిరిగే వీరిలో ఎవరు ఏ ఇయర్ చదువుతున్నారో వైద్య బోధన సిబ్బందికి అర్థం కావడం లేదు. దీంతో ఈ విషయంపై అందిన సూచనలతో ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ స్పందించారు. ప్రతి ఇయర్ వైద్య విద్యార్థికి టాప్ (షర్ట్) వరకు లేత రంగులో యూనిఫారం ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన భావిస్తున్నారు. మంగళవారం కొందరు క్లాస్ లీడర్లను పిలిపించి యూనిఫారంపై వారి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మాత్రం యూనిఫారం వద్దని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై వైద్యాధికారులు త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.


జీఎంసీ 1977వ బ్యాచ్ రూ.10 లక్షలు..



డైనింగ్ టేబుల్స్

గుంటూరు వైద్య కళాశాల 1977వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ మాతృ విద్యా సంస్థకు రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఇటీవల ఈ బ్యా చ్‌కు చెందిన విజయవాడలో ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ కాలేషావలీ ఈ విరాళాన్ని జీఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారికి అంద జేశా రు. ఈ నగదుతో వైద్య విద్యార్థులు భోజనాలు చేసేందుకు అవసర మైన డైనింగ్ టేబుళ్లను కొనుగోలు చేశారు. ఒక్కొక్క డైనింగ్ టేబు ల్‌పై ఎనిమిది మంది విద్యార్థులు ఆశీనులైన భోజనం చేయవచ్చు. మొత్తం 35 టేబుళ్ల యూనిట్‌లను కొనుగోలు చేశారు. వీటి ద్వారా 280 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయవచ్చు. వచ్చే వారంలో వీటిని వైద్య కళాశాలలో ఏర్పాటు చేస్తారు.

విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్‌గా సతీష్



బాధ్యతలు స్వీకరించిన యడ్లపల్లి సతీష్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వి త్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్‌గా యడ్లపల్లి సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన విభాగ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఈ పదవిలో నియమించిన విషయం విధితమే. యడ్లపల్లి సతీష్ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ పదవిలో ఏడాది పాటు కొనసాగే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లకు అన్ని విధాలా మేలు జరిగేలా చూస్తానని చెప్పారు. సతీష్‌కు పదవి దక్కటం పట్ల ఆచార్య ఎన్ జీ రంగా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

'యూత్ ఫర్ మై భారత్'లో వీవీఐటీ విద్యార్థులు

పెదకాకాని, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నేషనల్ స్వయం సేవక్ (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో అస్సాంలోని అస్సాం అగ్రికల్చరల్ యూనివర్సిటీ నందు జనవరి 21 నుంచి 27 వరకు నిర్వహించిన జాతి సమగ్రతా శిబిరం "యూత్ ఫర్ మై భారత్" నకు వీవీఐటీ కళాశాలకు చెందిన బి.వి. అజయ్ కుమార్, సీహెచ్ జీవన అనే ఇద్దరు విద్యార్థులు హాజరయ్యారని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. యువతను శక్తివంతం చేయడానికి మరియు దేశ నిర్మాణ కార్యకలాపాలలో నిమగ్నం చేయడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరానికి దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి 200 మంది ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులను ఎంపిక కాగా, కేవలం వీవీఐటీ కళాశాల నుంచి ఈసీఈ విభాగానికి చెందిన బి.వి. అజయ్ కుమార్, సీఎస్ఈ విభాగానికి చెందిన సీహెచ్ జీవన ఎంపిక కావడం విశేషం అని వివరించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ బృందం ద్వారా గ్రామాలలో ప్రత్యేక శిబిరాలు, సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటరు అవగాహనా సదస్సులు పలు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొ న్న తీరును పరిగణలోనికి తీసుకుని ఈ విద్యార్థులు ఎంపిక చేయబడ్డారని ఆయన తెలిపారు. శిబిరంలో విద్యార్థులు సమైక్యతా, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి అంశాలపై చర్చలు, సామూహిక కార్యక్రమాలలో పాల్గొన్నారని తెలిపారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి పాల్గొన్న 10 మంది విద్యార్థులతో కలిసి తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా కోలాటం, కూచిపూడి నృత్యం, రంగవల్లు లను ఈ శిబిరంలో ప్రదర్శించారని తెలిపారు. అనంతరం అజయ్ కుమార్. జీవనలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ వై. మల్లికార్జున రెడ్డి అకడమిక్ డీన్ కె.గిరిబాబు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐ.ఎల్.కె భక్తసింగ్ తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

నల్లి తెగులుతో తాలుకాయలు

● మార్కెటింగ్ జేడీ ఎదుట రైతుల ఆవేదన

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చికి ఈ ఏడాది కూడా నల్లి తెగులు సోకింది. దీనివలన తాలుకాయలు ఎక్కువ శాతం వస్తున్నాయి. రంగు లేకపోతుండటంతో ధర రావడం లేదని ఆరుగాలం కష్టపడి మిరపకాయలను పండించిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాలుకాయల వలన మార్కెట్‌యార్డులో తేజ వెరైటీకి ధర క్వింటాల్ రూ. 7 వేల నుంచి రూ. 7,500, సీడ్ వెరైటీలకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేలు మాత్రమే వస్తున్నాయని చెప్పారు. మంగళవారం ఉదయం మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత ఆదేశాల మేరకు విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, ఏడీ(ఎం) బీ రాజబాబు మిర్చియార్డులో విస్తృతంగా పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను వెలిబుచ్చారు. అనంతరం యార్డు పరిపాలన భవనంలో ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రికతో కలిసి సెక్రెటరీలు, అసిస్టెంట్ సెక్రెటరీలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు.



మిర్చియార్డులో రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, ఇతర అధికారులు

ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మిర్చి యార్డులో రైతులు ఎక్కడా ఇబ్బంది పడరాదన్నారు. ఏ రోజు వచ్చిన రైతులు ఆ రోజు మిర్చిని అమ్మేసుకొని వెళ్లిపోయేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత ఏడాది వలే యార్డుని బ్లాకులుగా విభజించి సెకటరీలు, సూపర్‌వైజ ర్లకు డ్యూటీలు వేసి బాధ్యతలు కేటాయించాలని సూచించారు. జిల్లా ఎస్పీని కలిసి ఒక పోలీసు అవుట్‌పోస్టు శాశ్వతంగా మిర్చియార్డులో ఏర్పాటు చేసేలా సహాయం తీసుకోవాల న్నారు. అదనపు సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలన్నారు. యార్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైతే అన్ని గేట్లు తెరిచి సరుకుని లోనికి అనుమతించాలని ఆదేశించారు. ఎక్కడా డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చూసుకోవా లన్నారు. అలానే మార్కెట్ ఫీజు వసూళ్లను లక్ష్యం మేరకు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ గ్రేడ్‌ల సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, ఆంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ చొరవతో స్వగ్రామానికి

- విశాఖవాసులను ట్రైన్లో నుంచి దింపేసిన టీసీ
- తెనాలి రైల్వేస్టేషన్‌లో బాధిత కుటుంబం పడిగాపులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేయించుకునేందుకు ఓ కుటుంబం విశాఖ నుంచి కడపకు వెళ్లగా అక్కడ వారి లగేజ్ పోవడం.. డబ్బులు లేకపోవడంతో టిక్కెట్ లేకుండా రైలు ఎక్కడంతో టీసీ తెనాలిస్టేషన్‌లో దింపేయగా సబ్‌కలెక్టర్ చొరవతో వారు స్వగామానికి వెళ్లారు. ఈ ఉదంతం మంగళవారం తెనాలిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విశాఖదగ్గర గంపరాయి గ్రామానికి చెందిన కాశయ్య కాళ్లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వైకల్యానికి గురయ్యాయి. దీంతో కడపలో చికిత్స నిమిత్తం భార్య పిల్లలతో వెళ్లాడు. ఆస్పత్రిలో వైద్యులను కలిసి వచ్చే క్రమంలో లగేజిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో కట్టుబట్టలతో మిగిలిన ఆ కుటుంబం తిరిగి స్వగ్రామానికి చేరేందుకు డబ్బులు లేకపోవడంతో రైల్వే పోలీసులకు విషయం చెప్పారు. ట్రైన్ ఎక్కి టీసీకి వివరాలు తెలిపితే ఇబ్బంది పెట్టడని చెప్పడంతో కుటుంబసభ్యులతో కాశయ్య ట్రైన్ ఎక్కాడు. రైలు తెనాలి సమీపంలోకి వచ్చేసరికి టిక్కెట్ లేకుండా ప్రయాణానికి టీసీ నిరాకరించారు. విషయం చెప్పి బతిమిలాడినా అంగీకరించకుండా తెనాలి స్టేషన్లో దించేశాడు. అక్కడ దీనంగా కూర్చున్న వారి దుస్థితి గురించి స్థానికులు సబ్‌కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన సబ్‌కలెక్టర్ సంజనసిన్హా తక్షణమే వారిని ఆదుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణను ఆదేశించారు. దీంతో స్టేషన్‌కు వెళ్లి ప్లాట్‌ఫాంపై ఉన్న వారిని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తీసుకువచ్చి వారి ఆకలితీర్చారు. అనంతరం వారు తిరుగు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేసి మధ్యాహ్నం జన్మభూమి ట్రైన్‌కు టిక్కెట్లు కొనిచ్చి దారిఖర్చులకు కొంత నగదు సమకూర్చి తహసీల్దార్ గోపాలకృష్ణ, సిబ్బందితో వారిని స్టేషన్‌లో ట్రైన్ ఎక్కించారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న తమకు అధికారులు చూపిన చొరవకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌కలెక్టర్, తహసీల్దార్ స్పందించిన తీరును పలువురు అభినందించారు.



తెనాలిలో బాధితులను ట్రైన్ ఎక్కిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

పక్కాగా రోగుల లెక్క



రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న దృశ్యం

● ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో సమగ్ర వివరాలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోగులు చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చినప్పుడు వారిని పరీక్షించిన వైద్యులు రోగుల ఓపీ షీట్‌పై వ్యాధి, వైద్య పరీక్షల వివరాలను, వాడాల్సిన మందులను రాసి పంపించే వారు. ఆయా వివరాలు మరెక్కడా నమోదు అయ్యే పరిస్థితి లేదు. అనంతరం మరోమారు ఆ రోగి మరోమారు ఆస్పత్రికి వచ్చిన సందర్భంలో ఆ ఓపీ షీటు లేనట్లయితే గతంలో ఆ రోగి ఆరోగ్య స్థితి గురించిన పూర్తి సమాచారం వైద్యులకు తెలిసే అవకాశం లేదు. దీంతో రోగుల పూర్వ ఆరోగ్య పరిస్థితిని అనుసరించి ప్రస్తుతం వ్యాధికి చికిత్స అందించే అవకాశం వైద్యులకు ఉండటం లేదు. ఈ సమస్యలను పరిష్కరించేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ యాప్‌ను అభివృద్ధి చేశాయి. ఆ యాప్‌లో రోగులకు అందించే చికిత్స సమగ్ర వివరాలు నమోదు కానున్నాయి.

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వచ్చే రోగుల ఆరోగ్య సమగ్ర సమాచారం వివరాలు ఇకపై పక్కాగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో నమోదు కానున్నాయి. ఆస్పత్రి సిబ్బంది సమన్వయంతో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ యాప్‌లో రోగి ఆధార్, సెల్‌ఫోన్ నెంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేస్తారు. అనంతరం ఓపీ షీటులో రోగి పేరు, వయస్సు వంటి వివరాల నమోదుతో పాటు తొమ్మిది అంకలతో నెంబరు ఇస్తారు. ఆ నంబరు ఆధారంగానే ఆయుష్మాన్ భారత్ యాప్‌లో ఆ రోగి ఆరోగ్య స్థితిగతుల వివరాలను నమోదు చేస్తారు. రోగి ఆధార్, లేదా ఆ తొమ్మిది అంకెల నంబరు ఆధారంగా దేశంలో ఏ ఆస్పత్రిలోనైనా ఆ రోగి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందించే వైద్య సేవలన్నీ ఎన్‌టీఆర్ వైద్య సేవలో నమోదు చేయాలని ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందించే వైద్యం, వార్డుల్లో వారికి అందిస్తున్న చికిత్స వివరాలను ఎన్‌టీఆర్ వైద్య సేవల్లో నమోదు చేస్తే దీని ఆధారంగా నగదు ఇస్తారు. ఇప్పటికే సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటి వరకు శస్త్ర చికిత్సలు చేసుకున్న రోగుల వివరాలను మాత్రమే నమోదు చేశారు. ఇప్పుడు ఎన్‌టీఆర్ వైద్య సేవలో రోగులకు అందించే వైద్యం వివరాలను నమోదు చేస్తున్నారు.

రోగుల సమాచారం పక్కాగా...



ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్న రోగుల వివరాలు పక్కాగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో వివరాలు నమోదు చేస్తున్నాం. ఆస్పత్రికి వచ్చే రోగుల సమగ్ర సమాచారం నమోదువుతుంది. దీనివలన రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది.

-డాక్టర్ లక్ష్మణరావు,
ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి



అన్నగారి సంతకు ఆలనాపాలనా కరువు

- నాడు రెండు తెలుగు రా ష్ట్రాలలో ప్రత్యేక గుర్తింపు
- వైసీపీ పాలనలో రైతుల స్థానంలో దళారుల హవా
- ఇష్టారాజ్యంగా ధరలు, అమ్మకాలు
- గత్యంతరం లేక కొనుగోలు చేస్తున్న ప్రజలు
- కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా గాడిన పడని వైనం

అద్దంకి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాలలో దశాబ్ద కాలం కిందట ప్రత్యేక గుర్తింపు పొందిన అద్దంకిలోని అన్నగారి సంత ప్రస్తుతం మినుకు మినుకు మంటూ ఉంది. పదేళ్ల కాలం కిందట ప్రారంభించిన సంత తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నంత కాలం ఒక వెలుగు వెలిగిన అన్నగారి సంత వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నగారి సంతను రాజన్న సంతగా మార్పు చేశారు. అప్పటి వరకు రైతులే నేరుగా అమ్మకాలు చేసుకోగా క్రమేపీ దళారులు రంగ ప్రవేశం చేశారు. తరువాత వచ్చిన మార్కెట్ కమిటీ పాలకవర్గాలు సంత నిర్వహణపై పెద్దగా శ్రద్ధ తీసుకోకపోవడంతో రోజు రోజుకు దిగజారుతూ వచ్చింది. ధరలపై నియంత్రణ లేకుండా పోయింది. బహిరంగ మార్కెట్‌లో ధరలకు సంతలో ధరలకు పెద్దగా వ్యత్యాసం లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం రాకతో నాటి పూర్వ వైభవం వస్తుందని ప్రజలు ఆశించారు. అయితే రాజన్న సంత కాస్తా అన్నగారి సంతగా మార్పు జరిగిందే కానీ నిర్వహణలో మాత్రం మార్పు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా ఇంకా మార్కెట్ కమిటీ పాలక మండలి నియామకం జరగకపోవడంతో సంత నిర్వహణ ఆలనా పాలనా పట్టించుకునే వారు లేకుండా పోయారు. మార్కెట్ యార్డు తరఫున అధికారికంగా నిర్వహణ లేకపోవడంతో అధికారులు పట్టించుకునే అవకాశం



అద్దంకిలోని మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న సంతలో కొనుగోలు చేస్తున్న ప్రజలు

లేకుండా పోయింది.

గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో 2015 జూలై 5వ తేదీ అప్పటి అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్ నాగినేని రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎన్టీఆర్ పేరుతో అన్నగారి సంతగా నామకరణం చేసి ప్రారంభించారు. ప్రతి ఆదివారం అద్దంకిలోని నిర్వహించే సంతకు అద్దంకి ప్రాంతంలో రైతులు సాగు చేసే అన్ని రకాల కూరగాయలను నేరుగా తెచ్చుకొని విక్రయించుకునేలా ఏర్పాటు చేశారు. అదే సమయంలో స్థానికంగా పండని కూరగాయలను మాత్రం మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చి అమ్మకాలు చేసే వారు. అనంతరం అద్దంకి మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న మేదరమెట్లలో బుధవారం, పంగులూరులో శుక్రవారం సంతలు ఏర్పాటు చేసి నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పంగులూరులో సంతను మూసి వేశారు. ఇక అద్దంకి, మేదరమెట్లలో కూడా రైతుల స్థానంలో వ్యాపారులు రంగప్రవేశం చేసి వ్యాపారాలు నిర్వహించడం ప్రారంభించారు. అనంతరం వచ్చిన పాలకమండళ్లు సంత నిర్వహణపై శ్రద్ధ పెట్టకపోగా నీరు గార్చే ప్రయత్నాలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఇంకా పాలక మండలి నియమించకపోవడం, సంత నిర్వహణపై ఎలాంటి ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో నాటి వ్యాపారులే ప్రస్తుతం కూడా అమ్మకాలు చేస్తున్నారు. అతి కొద్ది మంది రైతులు మాత్రమే సంతలో అమ్మకాలు చేస్తున్నారు. ధరల విషయానికి వస్తే బయట మార్కెట్‌లో కూరగాయల ధరలకు సంతలో ధరలకు పెద్దగా వ్యత్యాసం ఉండటం లేదన్న అభి ప్రాయం వ్యక్తం అవుతుంది. దీంతో ఎక్కువ ధరలు చెల్లించాల్సి రావడంతో ప్రజల జేబులకు చిల్లులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అన్నగారి సంతకు పూర్వవైభవం వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రద్దీగా ఉన్న అన్నగారి సంత



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ విజయలక్ష్మి, పక్కనే జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

మార్టూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటూ వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతూ ప్రభుత్వం కల్పించిన ఉపాధి పనులను ఉపయోగించుకొని సద్వినియోగపరచుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏవీ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మార్టూరులో మండలంలో ఉపాధి పనులు 2023-2024కి సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్‌పై మండల కాంపెక్స్ వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి ఎంపీడీవో వై.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 1476 పనులుకు రూ.15కోట్ల25లక్షల 52వేల 604 విలువైన పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. వాటికి సంబంధించి ప్రజావేదికను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆడిట్‌లో బయటపడిన కొన్ని అవకతవకలను భవిష్యత్‌లో జరగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్ మాట్లాడుతూ ఈ ఆడిట్‌లో రూ.కోటీ28లక్షల విలువైన పనులలో వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. వాటిలో రూ.14లక్షల63వేలు రికవరీకి ప్రయత్నించగా, అందులో రూ.4లక్షల53 వేలు వసూలయ్యాయన్నారు. ఉదయంనుంచి కోలలపూడి, బొబ్బేపల్లి, రాజుగారిపాలెం తదితర గ్రామాలకు సంబంధించి ప్రజావేదికలో వివరాలను సోషల్ ఆడిట్ బృందం వెల్లడించారు. మిగిలిన గ్రామాలకు సంబందించి రాత్రి 8గంటలకు కార్యక్రమాలను పూర్తి చేశారు. కార్యక్రమంలో జూనియర్ క్వాలిటీ కంట్రోలు అధికారి సతీష్, ఏపీడీ కోటయ్య నాయక్, ఎంపీపీ భూక్యా శాంతిబాయి, ఏపీవో లక్ష్మీనారాయణ, ఈసీ రవికుమార్, ఫీల్డు అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇక బొమ్మ తీసేయడమే!

- సర్వే రాళ్లపై ఉన్న జగన్ చిత్రాలను తొలగించేందుకు నిధులు మంజూరు
- జిల్లాకు రూ.39.96 లక్షలు మంజూరు



ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్వే రాళ్లపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రాల(ఫొటోల)ను తొలగించేందుకు (యరైజ్) చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో భూముల రీసర్వే చేసేందుకు సర్వే రాళ్లపై జగన్ ఫొటోలను చిత్రీకరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వ చ్చాక ఆ రాళ్లపై ఉన్న ఫొటోలను తొలగించేందుకు జిల్లాకు రూ.39.96 లక్షలను మంజూరుచేసింది. జిల్లావ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వంలో 2,66,421 సర్వే రాళ్లను ఏర్పాటు చేయగా వాటిపై ఉన్న ఫొటోలను తొలగించేందుకు ఒక్కొక్క రాయికి రూ.15 చొప్పున రూ.39.96 లక్షలు మంజూరుచేసింది. సర్వే శాఖ నుంచి అందుకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చిన వెంటనే కలెక్టరేట్ నుంచి నిధులను మండలాల వారీగా జమ చేయనున్నారు.

జంగాలపల్లి నుంచి వాటర్‌షెడ్ యాత్ర

- రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఇక్కడి నుంచే
- జాతీయ స్థాయిలో ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి ప్రారంభం
- ప్రత్యక్ష ప్రసారం

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నీటి సంరక్షణ పనులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో డ్వామా ద్వారా అమలు జరిగే వాటర్‌షెడ్ పనులపై ప్రజల్లో విస్తృత అవగాహనపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే చెరువులు, కుంటల అభివృద్ధి పనులను గ్రామానికి కనీసం ఒక్కటైనా చేపట్టాలని నిర్ణయించగా రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి సంరక్షణ పనులు భారీగా చేపట్టాలని నిర్ణయించారు. ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన వాటర్ హెడ్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టనుండగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రచార రథాలను ఏర్పాటు చేసి వాటర్‌షెడ్ పథకం అమలు చేసే ప్రాంతాలలో విస్తృత ప్రచారం చేయనున్నారు. ఒక్కొక్క రాష్ట్రానికి ఒక ప్రచార రథాన్ని ఏర్పాటుచేయగా ఢిల్లీలో ఆ కార్యక్రమాన్ని బుధవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి గిరిజ్‌సింగ్ లాంఛనంగా ప్రారంభిస్తారు. తదనుగుణంగా ఆయా రాష్ట్రాలలో స్థానికంగా కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నారు.

పండుగ వాతావరణంలో..

కాగా రాష్ట్రంలో ప్రచారరథం కార్యక్రమాన్ని జిల్లా నుంచి చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందుకు కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం మురగమ్మి పంచాయతీలోని జంగాలపల్లిని ఎంపిక చేశారు. అక్కడ వాటర్‌షెడ్ కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేసి ఉండగా ఆ ప్రాంతంలో పండుగ వాతావరణంలో ప్రచారరథాన్ని ప్రారంభించేలా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఉపాధి పథకం డైరెక్టర్ షణ్ముక్ తదితరులు పాల్గొనున్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ హాజరవుతారని సమాచారం ఉన్న ఆఖరు నిమిషంలో ఆయన పర్యటన రద్దయింది. కాగా ఢిల్లీలో కేంద్రమంత్రి ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ప్రత్యక్ష ప్రసారం నిర్వహించిన అనంతరం రాష్ట్రస్థాయి ప్రచార రథాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం.

కౌలు రుణాలు.. తీసికట్టు

(5వ పేజీ తరువాయి)

రూ.8,306 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాలలో ఇప్పటికే 90 శాతం చేరుకున్నట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియబోతున్నందున అప్పటికి వంద శాతం లక్ష్యాలను చేరుకుంటామనే ధీమాను బ్యాంకర్లు వ్యక్తం చేస్తున్నాయి. ఇన్ని వేల కోట్ల పద్దులో కౌలు రైతులకు దక్కిన వాటా పరిశీలిస్తే విస్తుపోవాల్సిందే.

ప్రణాళికా లోపం.. నిబంధనల శాపం

సీసీఆర్‌సీ కార్డుల కాల వ్యవధి పదకొండు నెలలే. వీటి జారీని మే నుంచి ఏప్రిల్ వరకు మాత్రమే ఇస్తారు. ఇవి కౌలు రైతులకు అందేసరికే జూలై, ఆగస్టు నెలలు వసున్నాయి. అప్పటికే ఇచ్చిన వ్యవధిలో రెండు నెలలు గడిచిపోతుంది. బ్యాంకర్లు పెట్టే నిబంధనలకు అటువైపు కన్నెత్తి చూడాలంటేనే రైతులు భయపడాల్సిన పరిస్థితి. ఇక భూ యజమానులకు అవగాహన లేక కౌలు చేసుకునే రైతులకు రుణాలు అందించడానికి సుముఖత వ్యక్తం చేయడంలేదు. పైగా వారే రుణాలు తీసుకోవడం కూడా కౌలు రైతులకు ప్రతిబంధకంగా మారుతోంది. ఇదే కాకుండా ఏటికేడు కౌలు చేసుకునే రైతులు మారుతుండడంతో వారు కట్టకపోతే ఆ మొత్తం తమ నెత్తిన పడుతుందనే భయంతో యజమానులు వెనుకంజ వేస్తున్నారు. ఇవేకాకుండా అధికారుల వైపు నుంచి రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి కొరవడింది. ఆర్థిక సంవత్సరం ముగింపులో హడావిడిగా భూ యజమానులకు అవగాహన సదస్సులు నిర్వహించడం లాంటి మొక్కుబడి కార్యక్రమాలతో సరిపెడుతున్నారు. నిజానికి సేద్యం రుణ పద్దులో పదిశాతం కౌలు రైతుల వాటాగా ఉండాలనే డిమాండ్‌ను రైతు సంఘాలు ఎప్పటి నుంచో చేస్తున్నాయి. కానీ ప్రసుతం తీసికట్టుగా నిర్దేశించుకున్న పదుల కోట్ల రుణాలే రైతుల చెంతకు చేరని దయనీయ పరిస్థితి కనబడుతోంది. ఇక పదిశాతం వాటా ఎప్పటికి దక్కేను అని కౌలు రైతులు వాపోతున్నారు.

యాంత్రీకరణ పద్ధతులతో వ్యవసాయం లాభసాటి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అధునిక వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.ధనరాజ్ అన్నారు. మంగళవారం బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతు డ్రోన్‌లా ద్వారా రసాయనిక ఎరువులు, పురుగుమందులు పిచికారీ ద్వారా సాగుఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. మండలంలో రాయితీపై డ్రోన్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ మాట్లాడుతూ రైతు రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు ప్రత్యేక సంఖ్యలు కేటాయిస్తామని, ప్రతి రైతు తమ ఆధారాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ పంట నమోదును ఈనెల 10వ తేదీతో ముగుస్తుందని, పంటలు సాగు చేసిన రైతులు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ వీరశంకర్, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : పంట మార్పిడి విధానంతోనే శనగలో ఎండు తెగులు నివారణ సాధ్యపడుతుందని మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో రైతులు సాగు చేసిన మిరప, శనగ, మొక్కజొన్నను పరిశీలించారు. శనగ విత్తే దశలో ఆ పంటకు ఆశించే పురుగులు, శిలీంద్రాల తెగుళ్లను నివారించేందుకు ట్రైకోడెర్మావిరిడితో



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

విత్తన శుద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, రైతు సేవా కేంద్రం అధికారి సునీత, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల, : మొక్కజొన్నలో మోము పురుగు రాకుండా సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని అనమనమూరు, ఎర్రబాలెం గ్రామాలలో మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువులవాడకం, పంటలకు నీటి తడుల గురించి సమగ్రంగా వివరించారు.

చినగంజాం : రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సాగులో ఉన్న గెనిసగడ్డ, వేరుశనగ, వరి తదితర పంటలను వ్యవయాధికారులు పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని అన్నారు. పీఎం కిసాన్‌కి సంబంధించిన రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోని వారు వెంటనే చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ డబ్బులు జమకాకపోతే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రేవతి, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసుకోవాలన్నా, నష్టపరిహారం అందాలన్నా ఈక్రాప్ తప్పని సరిఅని వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చింతగుంటపాలెం, పెద్దివారిపాలెం గ్రామాల్లోని శనగ పైర్లను వ్యవసాయాధికారులు రైతులతో కలసి పరిశీలించారు. ప్రస్తుతం పూతదశలో ఉన్న శనగకు తుప్పు తెగులుతో పాటు, ఎండు తెగు లు వచ్చే అవకాశం అధికంగా ఉందని దీని నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి. పడమర పెద్దివారిపాలెం గ్రామాలలో మిరప పొలాలను వ్యవసాయ అధికారి మేరమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ మిరపలో నల్లతామర పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సుదర్శన్ తదితర రైతులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా శనగలో పూతరాలడాన్ని నివారించుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని వంకాయలపాడు, సుబ్బారెడ్డిపాలెంలో సాగులో ఉన్న శనగను ఆయన పరిశీలించారు. శనగలో పూత రాలకుండా ప్లానోఫిక్స్, కంటాప్లస్‌ను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ వెంకటస్వామి, అలెగ్జాండర్, రైతులు పాల్గొన్నారు.



తూర్పు కొప్పెరపాడులో శనగను పరిశీలిస్తున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు



దుకాణదారులతో మాట్లాడుతున్న ఆర్వో భాస్కర్, ఆర్ఐ కల్యాణి

కొత్త మార్కెట్ బకాయిలపై కార్పొరేషన్ కొరడా

- అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు
- రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు ఆదాయ వనరులపై దృష్టిసారించారు. ఈ మేరకు మంగళవారం ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో కొరడా ఝుళిపించారు. గత ఐదేళ్లలో కొవిడ్ సాకుగా చూపి అద్దెలు చెల్లించకపోవడంతో కార్పొరేషన్ ఆదాయానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. నాటి వైసీపీ నేతల అండదండలతో అద్దెలు చెల్లించకపోవడంతో రూ.12కోట్లు బకాయిలు ఉన్నాయి. అందులో హోల్‌సేల్ దుకాణాల నుంచి రూ.5కోట్ల వరకు వసూలు కావాల్సి ఉంది. దీంతో దీర్ఘకాలింగా పెండింగ్ ఉన్న బకాయిల వసూళ్లపై అధికారులు రంగంలోకి దిగారు. రూ.10లక్షలు నుంచి ఆపై బాకీ ఉన్న దుకాణాలకు తాళాలు వేశారు. దీంతో కొందరు వ్యాపారులు అధికారుల తీరును తప్పుబట్టారు. నష్టాల ఊబిలో ఉన్నామని, అద్దెలు చెల్లించడానికి గడువు కావాలంటూ పట్టుబట్టారు. అయితే కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల ఒక్క పైసా కూడా చెల్లించలేదు.. ఇంకా గడువు ఇవ్వడం కుదరదంటూ తేల్చిచెప్పారు. ప్రతి ఒక్కరు పైసాతో సహా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంలో రెవెన్యూ ఉద్యోగులు, వ్యాపారుల మధ్య కొద్దిసేపు చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేదు. ఈ మేరకు అధిక మొత్తంలో బకాయి ఉన్న దుకాణాలకు తాళాలు వేయగా, తక్కువ బకాయి ఉన్న వారికి హెచ్చరికలు జారీచేస్తే వెంటనే చెల్లించాలని ఆదేశించారు. అయితే దుకాణాలకు తాళాలు వేసే క్రమంలో వ్యాపారులవైపు నుంచి ఎలాంటి అడ్డగింతలు రాకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి విజయ్ భాస్కర్, ఆర్ఐలు బి.కళ్యాణి, కే.క్రాంతితోపాటు శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశంలో సమయం మార్పు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాత జిల్లాపరిషత్ సమావేశం హాల్‌లో ఈనెల 9వతేదీన నిర్వహించనున్న జడ్పీ సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా పరిషత్ సీఈవో బి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే మధ్యాహ్నంకు సమావేశాన్ని మార్పు చేసినందున అధికారులందరూ గమనించాలని కోరారు. సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

నివేదిక బయటకెలా వెళ్లింది..?

- నాకు చేరక ముందే ఫిర్యాదుదారులకా..!
- డీపీవోపై కలెక్టర్ అన్సారియా సీరియస్
- పలువురు జిల్లా అధికారుల సమక్షంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరిక
- బాధ్యులపై చర్యలతో పాటు కార్యాలయాన్ని చక్కదిద్దుకోవాలని ఆదేశం
- ప్రజాప్రతినిధుల్లోనూ అసంతృప్తి

'మీ ఆఫీసులో ఏం జరుగుతుందో, ఏ ఫైల్స్ ఎటు పోతున్నాయో మీరు తెలుసుకోలేరా, నేను ఆదేశించిన విచారణ నివేదిక నా దగ్గరకు రాకుండా ముందే బయటకు ఎలా వెళ్లింది. ఇలాగేనా జిల్లా అధికారి పనిచేసేది, ఇన్ని డిపార్ట్‌మెంట్లు జిల్లాలో ఉన్నాయి మీ శాఖ నుంచి వస్తునన్ని సమస్యలు నాకు ఎక్కడా రావడం లేదు. ఇలాగైతే చర్యలు తప్పవు' అంటూ జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడుపై కలెక్టర్ తమీమ్ అన్సారియా మండిపడటం జిల్లా అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సౌమ్యంగా మాట్లాడే కలెక్టర్ అన్సారియా జిల్లా అధికారులు అందరి సమక్షంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కారణం ఏమిటన్న విషయంపై పలువురు అధికారులు ఆరా తీస్తున్నారు. ఆయన వైఖరి తెలిసిన కొందరు మాత్రం ఇక్కడ చేరి ఇన్నిరోజులైనా శాఖాపరంగా పట్టు పెంచుకోకపోతే ఎలా అన్న భావన వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారులతో సోమవారం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ కార్యాలయ పనితీరుపై సీరియస్ అయ్యారు. విచారణ నివేదిక బయటకు వెళ్లడం ఏమిటని డీపీవోను ప్రశ్నించారు. ఆయన తనకేమీ తెలియదని చెప్పడంతో మండిపడ్డారు. ఈ వ్యవహారం మంగళవారం అధికార వర్గాలలో విస్తృత చర్చకు దారితీసింది. కలెక్టర్ అన్సారియా ఇక్కడ బాధ్యతలు స్వీకరించి ఏడు మాసాలు పూర్తి కాగా ఇంతవరకు జిల్లా అధికారి ఎవరిపైనా ఈ స్థాయిలో మండిపడిన దాఖలాలు లేవని పలువురు అంటున్నారు. అసలు కారణం ఏమిటన్న విషయం పరిశీలిస్తే.. సింగరాయకొండ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదుతో డిసెంబరు



వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ అన్సారీయా

ఆఖరు వారంలో విచారణకు కలెక్టర్ త్రిసభ్య కమిటీని నియమించారు. మెప్మా పీడీ రవికుమార్ నేతృత్వంలో నియమించిన కమిటీ ఈ విచారణను నిర్వహించి నివేదికను డీపీవో కార్యాలయంలో అందజేశారు. నెల రోజులు గడిచినా సదరు నివేదిక కలెక్టర్‌కు చేరకపోగా ఫిర్యాదుదారులకు డీపీవో కార్యాలయం నుంచి చేరినట్లు సమాచారం. ఆర్టీఐ యాక్టు ద్వారా పొందిన సదరు ఫిర్యాదుదారులు ఒక రాజకీయ పక్షానికి చెందిన వారు కాగా ఆ నివేదికలో కొన్ని లోపాలు ఉన్నాయంటూ వారు మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే తాను నియమించిన కమిటీ నివేదికను తనకు నివేదించక ముందే బయటి వ్యక్తులకు చేరడాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ అదే విషయాన్ని సోమవారం సాయంత్రం వీసీ సందర్భంగా అందరూ అధికారుల సమక్షంలోనే డీపీవోను అలా ఎలా బయటకు వచ్చిందని ప్రశ్నించారు. తనకు ఆ విషయమే తెలియదని డీపీవో చెప్పడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ మీ ఆఫీసులో ఏమి జరుగుతుందో తెలియదా.. అని అడిగారు. ఇలాంటి సమాచారం బయటకు పోతున్నా అప్రమత్తత లేకుండా ఉంటారా? అని మండిపడినట్లు సమాచారం.

కార్యాలయంలో రాని మార్పు

ఈ ఒక్క అంశంలోనే కాక జిల్లా పంచాయతీ కార్యాలయం పనితీరుపై ఇటు కలెక్టర్‌కు, అటు అధికారపార్టీ ప్రజాప్రతినిధులకు అనేకసార్లు ఫిర్యాదులు అందడం, దానిపై డీపీవోను కొందరు హెచ్చరించడం కూడా జరిగినట్లు సమాచారం. ఇక్కడ బాధ్యతలు చేపట్టి మూడు, నాలుగు నెలలు అవుతున్నా కార్యాలయంలో పని పద్ధతులలో మార్పు రాలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా అంశాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అడిగినా.. ఇక్కడ ఎవరు పనిచేయడం లేదు, ఫైళ్ల తానే రాసుకుంటున్నానని చెప్పడం, ఇతర అధికారుల వద్ద కూడా తరుచూ మాట్లాడటం వంటి విషయాలపై చర్చ సాగుతోంది. జిల్లాలో అత్యధికశాతం మంది వైసీపీ సర్పంచ్‌లు ఉండగా ప్రస్తుతం అధికార టీడీపీ ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా డీపీవో వ్యవహరించకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని నేతలు చర్చించుకోవడమే కాక కలెక్టర్ దృష్టికి కూడా కొందరు తీసుకెళ్లినట్లు సమాచారం.

అందని నారాయణరెడ్డి ఫైళ్లు

గతంలో ఇక్కడ డీపీవోగా పనిచేసిన జీవీ నారాయణరెడ్డి అప్పటి వైసీపీ కీలక పెద్దలకు సన్నిహితంగా మెలుగుతూ అక్రమాలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ విచారణకు ఆదేశించగా అందుకు అవసరమైన ఫైళ్లను విచారణాధికారి మూడు నెలల క్రితం కోరినా ప్రస్తుత డీపీవో ఇవ్వకపోవడంతో ఆ విచారణ ముందుకు సాగలేదు. ఈ విషయం కూడా ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా ఇక్కడ పోస్టింగ్ ఇప్పించడంలో కీలకంగా వ్యవహరించిన కీలక ప్రజాప్రతినిధి కూడా డీపీవో తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. సింగరాయకొండ పంచాయతీపై విచారణ కమిటీ నివేదిక బయటకు వచ్చిన వ్యవహారంపై కార్యాలయ ఏవోకు షోకాజ్ నోటీసు ఇచ్చి వివరణ తీసుకుని తనకు నివేదించాలని, అలాగే కార్యాలయ వ్యవహారాలను చక్కదిద్దుకోవాలని కలెక్టర్ ఆ సందర్భంగా డీపీవోను హెచ్చరించినట్లు సమాచారం.


ట్రైనీ డీఎస్పీ అభిషేక్‌ను అభినందిస్తున్న సీఐ శ్రీనివాసరావు

చీరాల వన్‌టౌన్‌లో ట్రైనీ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

చీరాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీగా మంగళవారం అబిషేక్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాసరావు అతనిని అబినందిస్తూ స్వాగతించారు. ప్రజాస్వామ్యంలో బాధితులకు అండగా ఉండి న్యాయ సమస్యల పరిష్కారానికి పోలీసు వ్యవస్థ పాటుపడుతుందని సీఐ తెలిపారు. అలాగే ట్రైనీ డీఎస్పీ కూడా విధుల్లో విజయవతంగా పని చేయాలని ఆకాంక్షించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి ఆయన్ని పరిచయం చేశారు.

హైవేతో మారుతున్న పర్చూరు రూపురేఖలు


జాతీయ రహదారి నిర్మాణంతో రూపురేఖలు మారుతున్న పర్చూరు


శరవేగంగా సాగుతున్న హైవే నిర్మాణ పనులు

- కూటమి ప్రభుత్వ హయాంలో శరవేగంగా రోడ్ల అభివృద్ధి
- పలు నిర్మాణాలతో గ్రామాలకు కొత్తకళ

పర్చూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచీ రహదారుల అభివృద్ధికి మహర్దశ పట్టింది. ఇటు గ్రామీణ సీసీ రోడ్లతోపాటు, ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులు సాగుతున్నాయి. దీనికితోడు జాతీయ రహదారుల నిర్మాణాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. అందులో భాగంగా వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈరోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. పర్చూరు మండల పరిధిలో 167ఏ జాతీయ రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. అందులో భాగంగా పర్చూరును అనుసంధానం చేస్తూ కారంచేడు మీదుగా వాడరేవు వరకు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. పర్చూరు - కారంచేడు మధ్య పనులు చకచకా జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణంతోపాటు కల్వర్టులు, ఫ్లైవోవనఖ బ్రిడ్జి ఏర్పాట్లకు సంబంధించిన పనులు చేపట్టారు. హైవే నిర్మాణంతో తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ వంటి ఇరు రాష్ట్రాల మధ్య రవాణాకు సులువు కానుంది. చీరాల ప్రాంతంలో వాడరేవు ఉండడం వల్ల ఇటు పర్యాటన రంగం కూడా అభివృద్ధి చెందనుంది. దీంతో వాణిజ్య వ్యాపారాల సైతం హైవే నిర్మాణంతో మరింత మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

ప్రస్తుతం చేపడుతున్న హైవే నిర్మాణాలకు సమీపంలో ఉన్న గ్రామాలు నూతన శోభను సంతరించుకునే విధంగా మార్పు చెందుతున్నాయి. హైవే అధికారుల పర్యవేక్షణలో పనులు శరవేగంగా సాగుతున్నాయి.

మెరుగైన రవాణా వ్యవస్థకు దోహదం

వాడరేవు - పిడుగురాళ్ల వరకు హైవేతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. హైదరాబాద్ నుంచి వాడరేవు రవాణాకు ఉపయోగపడే ముడిసరుకు రవాణాకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటికీ మించి మోటుపల్లి, పెద్దగంజాం, ప్రాంతానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలోనే రైల్వే ట్రాక్ కూడా ఉండడం రవాణాకు దోహదం. సమీపంలోనే విజయవాడ కృష్ణా బ్యారేజీ నుంచి చెన్నై వెళ్లే బకింగ్‌హాం కెనాల్ అభివృద్ధికి ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో ఈహైవే నిర్మాణం మరింత దోహదపడే అవకాశం ఉంది


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ హరనాథ్‌బాబు

తైక్వాండోలో చినగంజాం విద్యార్థుల సత్తా

చినగంజాం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర తైక్వాండో పోటీలలో విద్యార్థులు సత్తాచాటి, మెడల్స్ సాధించారని సత్యం హైస్కూల్ కరస్పాండెంట్ ఎన్.హరనాథ్‌బాబు తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో తూర్పుగోదావరి జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగిన 1వ ఎన్టీఆర్ మెమోరియల్ ఏపీ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్-2025 పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనపరచి పది మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం హైస్కూల్‌లో హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం అబినందన సభ జరిగింది. రాష్ట్ర తైక్వాండో పోటీలలో పాఠశాలకు చెందిన కే.దుర్గా హర్షిత రెడ్డి 42 కేజీల క్యాడిట్ విభాగంలో సిల్వర్ మెడల్, కే.రక్షితారెడ్డి 40.5 కేజీల క్యాడిట్ విభాగంలో సిల్వర్ మెడల్, సబ్‌జూనియర్ విభాగంలో జి.స్నిగ్ధశ్రీ 38.2 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, ఎం.జనని 25.6 కేజీల విభాగంలో, సీహెచ్ అవిత్ 32.8 కేజీల విభాగంలో, ఎల్‌వీ గీతిక 28.3 కేజీల విభాగంలో, బి.అమృత 27.3 కేజీల విభాగంలో, డి.దేవాదిత్య 20.6 కేజీల విభాగంలో బి.మహాలక్ష్మి 24 కేజీల విభాగంలో, పి.అక్షిత 17 కేజీల విభాగంలో కాంస్య మెడల్స్ సాధించినట్లు హరనాథ్‌బాబు తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ హరనాథ్ బాబు, హెచ్‌ఎం.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, తైక్వాండో కోచ్‌లు షేక్ సుల్తాన్, వాటుపల్లి సుబ్రమణ్యం అబినందించారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

బల్లికురవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తక్షణమే గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలానే గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామాలలో ఎక్కడ రోడ్ల వెంబడి చెత్త కనిపంచకుండా చర్యలు చేపట్టాలన్నారు. రిక్షాల ద్వారా చెత్తను చెత్త సంపద కేంద్రాలను తరలించాలన్నారు. కొన్ని గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే అందరూ అప్రమత్తంగా గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

స్తంభం పైనుంచి పడి వ్యక్తి మృతి

ఇంకొల్లు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులోని కొణికిరోడ్డులో విఘ్నేశ్వర కోల్డ్‌స్టోరేజీ సమీపంలో విద్యుత్ పనులు చేస్తుండగా స్తంభం పైనుంచి కాలుజారి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. దగ్గుబాడు గ్రామానికి చెందిన జీసస్‌బాబు(35) కరెంట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో విద్యుత్ పనులకు వెళ్లిన జీసస్‌బాబు స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా అదుపుతప్పి జారి కిందపడడంతో గాయాలయ్యాయి. వెంటనే ఒంగోలు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి జయసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. జీసస్‌బాబుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.


రీసర్వేలో పాల్గొన్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ

రీ-సర్వేతో పారదర్శకమైన సేవలు

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ-సర్వేతో రైతులకు పారదర్శకమైన సేవలు అందించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. కొంతకాలంగా మండల పరిధిలోని చీరాలనగర్ గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో పర్యవేక్షించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడారు. కొలతలలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాలువలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు


కొత్తపాలెంలో మురుగు కాలువలను ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదుపై పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎవరైనా మురికి కాలువలను ఆక్రమించి వాటిపై గృహ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో కె.కుసుమకుమారి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కొత్తపాలెంలో ఒక వ్యక్తి ప్రభుత్వ మురికి కాలువను ఆక్రమించి తన సొంత అవసరానికి వాడుకుంటున్నారని గ్రామ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో, ఈవోపీఆర్డీ సుమతి కాలువను పరిశీలించారు. తక్షణమే ఎగువ భాగంలో కాలువ ఎలా ఉందో అలా ఆక్రమణలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో ఆదేశించారు. పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి మార్జిన్లను ఆక్రమించుకుంటు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎంపీడీవో అన్నారు.

ఈఈఎంటీ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థి


శశాంక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎపిపని మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ) పరీక్షల్లో ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పాలెపు శశాంక్ ఉత్తమంగా రాణించాడు. ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించాడు. దీంతో మంగళవారం ప్రధానోపాధ్యాయిని సుధావాణి ఆధ్వర్యంలో అబినందన సభ నిర్వహించారు. ఈనెల 8వ తేదీన విజయవాడలో జరిగే బహుమతుల ప్రధానోత్సవంలో శశాంక్ క్యాష్‌ప్రైజ్ అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బర్లీ రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

పంగులూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రైవేటు కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి బర్లీ పొగాకు ధరలు పూర్తిగా తగ్గించి సంక్షోభానికి తెరతీశాయని, ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రైవేటు కంపెనీల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పొగాకు రైతులను ఆదుకోవాలన్నారు. కంపెనీల మాటలు నమ్మి రైతులు ఇతర పంటల సాగును వదిలేసి పొగాకు విస్తారంగా సాగు చేశారన్నారు. ఇది కొనసాగితే రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆదుంసాహెబ్, రాయిణి కిరణ్, డాక్టర్ మంచాల రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

తం సూర్యం ప్రణమామ్యహం

- ఘనంగా రథసప్తమి వేడుకలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి వేడుకలను మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా దేవాలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా చీరాలనగర్‌లోని సూర్యభగవాన్ ఆలయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

రథసప్తమిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని వీరరాఘవస్వామి ఆయలంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా వీరరాఘవస్వామిని గజ వాహనంపై పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి సేవలో తరించారు. పుర వీధులలో జరిపిన నగరోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.


గజ వాహనంపై ఊరేగుతున్న వీరరాఘవస్వామి

శింగరకొండలో పూజలు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం రథ సప్తమి పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు, పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోధుమ రవ్వ తో పొంగలి చేసి నైవేద్యం సమర్పించారు. ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. మంగళవారం కూడా కావటం తో శింగరకొండ కు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రసన్నాంజనేయస్వామి ని దర్శించుకున్నారు.


సూర్యభగవాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పర్చూరు : రథ సప్తమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. చిక్కుడు కాయలతో రథాన్ని తయా రు చేసి పూజలు చేశారు. జిల్లేడు ఆకులు, రేగుపండ్లు, చిక్కుడు ఆకులతో స్నానాలు ఆచరించారు.

చినగంజాం : రథసప్తమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రసాదాలను నివేదించారు.


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న పురోహితులు

యద్దనపూడి : రథసప్తమి సందర్భగా యద్దనపూడి మండలంలోని చింత పల్లిపాడు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవస్థానంలో భక్తులు పూజలు చేశారు. దేవస్థానం అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశేష ఆదిత్య ఆరాదన, విష్ణుచాలీసా ఆదిత్య హృదయ పారాయణాలు చేశారు. మార్టూరు పడమర బజారులోని శ్రీ రుక్మాబాయి పాండురంగ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో విశేష పూజలు చేశారు. ఇసుకదర్శి శ్రీపాండురంగస్వామి దేవస్థానంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇళ్లవద్ద తలపై జిల్లేడు, చిక్కుడు ఆకులు పెట్టుకొని స్నానాలను ఆచరించారు.


చెన్నకేశవస్వామి ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

సోషల్ మీడియాలో పోస్టులపై చర్యలు తీసుకోవాలి

వేటపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో విభేదాలు సృష్టించేలా పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కూటమి నాయకులు డిమాండ్ చేశారు. సోషల్ మాధ్యమాన్ని వేదికగా చేసుకుని ఓ వ్యక్తి త్వరలో చీరాలకు గొట్టిపాటి ఇన్‌చార్జిగా వస్తున్నట్లు పోస్టు చేశారు. దీంతో ఆగ్రహించిన కూటమి నాయకులు మంగళవారం వేటపాలెంలో ఆందోళన చేపట్టారు. నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని ఎమ్మెల్యే కొండయ్య అభివృద్ధికి పాటుపడుతున్న క్రమంలో విభేదాలు సృష్టించేలా ఉద్దేశపూర్వకంగా పోస్టులు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు ఎస్సై వెంకటేశ్వర్లును కలిసి ఫిర్యాదు చేశారు.

పాలేటి వ్యవహారం సరైనది కాదు

పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా ఎన్టీఆర్ విగ్రహానికి భూమిపూజ నిర్వహించిన పాలేటి తీరు సరైనది కాదని పలువురు టీడీపీ కూటమి నాయకులు అన్నారు. పార్టీ ప్రతిష్టను భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. విభేదాలు సృష్టించేలా వైసీపీ నాయకులతో భూమిపూజ చేయించడం విచారకరమన్నారు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పార్టీకు భంగం కలిగిస్తే విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నాశివీరభద్రయ్య, పార్థసారధి, పోతురాజు. మార్కండేయులు, పల్లప్రోలు శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఎస్ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కూటమి నాయకులు

కాలువలో బాలుడి మృతదేహం

- అదృశ్యమైన 24గంటల వ్యవధిలో శవమై లభ్యం
- అడుసుమల్లి ఎస్సీ కాలనీలో విషాదం

అడుసుమల్లి (పర్చూరు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి అదృశ్యమైన బాలుడు 24 గంటల వ్యవధిలో కాలువలో శవమై కన్పించాడు. ఈ ఘటన పర్చూరు మండలం, అడుసుమల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం వెలుగుచూసింది. కుంటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. అడుసుమల్లి ఎస్సీ కాలనీకి చెందిన కుంచాపు సందీప్ (15) స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి వస్తానని చెప్పి టీవీఎస్ వాహనంపై వెళ్లిన సందీప్ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా గంటలో వస్తానని ఫోన్ ద్వారా మెసేజ్ పంపాడు. రాత్రికి రాకపోవడంతో సోమవారం సందీప్ కోసం వెతకగా ఆచూకీ లేకపోవడంతో పర్చూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం కాలనీ సమీపంలోని లిఫ్ట్ ఇరిగేషన్ బావి వద్ద బాలుడు తీసుకువెళ్లిన మోపెడ్, చెప్పులు కనపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న బంధువులు బావి పక్కనున్న కాలువలో బాలుని మృతదేహం తేలుతూ ఉండడాన్ని గమనించి బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్సై సురేష్‌రెడ్డి, సిబ్బందితో కలసి ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టంకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదమా లేక ఇతర కారణాలాల అన్నది విచారణలో తేలాల్సి ఉంది.


సందీప్ (ఫైల్)


కాలువ నుంచి వెలికి తీసిన బాలుని మృతదేహం

ఏడేళ్ల కిందట తల్లిదండ్రులు మృతి

ఏడేళ్ల కిందట కొద్దిపాటి వివాదంతో సందీప్ తల్లిదండ్రులు కుంచాపు కిషోర్, సుజాత ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో సందీప్ తాత, బాబాయి సంరక్షణలో అడుసుమల్లిలోనే ఉంటూ స్థానిక పాఠశాలలో చదువుకుంటున్నాడు. ఇటీవల తాత కూడా మృతి చెందారు. ఇప్పుడు సందీప్ కూడా మృతి చెందడంతో ఎస్సీ కాలనీలో విషాదం చోటుచేసుకుంది.

సారా స్థావరంపై దాడులు


పట్టుబడిన నిందితులతో వేటపాలెం పోలీసులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీ స్థావరంపై వేటపాలెం పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని వివేకానంద కాలనీలో కాలనీ శివారులో దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. దాడుల్లో స్టేషన్ సిబ్బది పాల్గొన్నారు.

కాపు, బలిజ సంక్షేమ సేన మండల అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ


లక్ష్మీనారాయణ

చినగంజాం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన ఘంటా లక్ష్మీనారాయణ కాపు, బలిజ సంక్షేమ సేన చినగంజాం మండల అధ్యక్షుడిగా నియమితులైనారు. కాపు, బలిజ సంక్షేమ సేన ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం ప్రకారం లక్ష్మీనారాయణను ఎంపిక చేసి, నియామకపత్రాన్ని అందజేసినట్లు సేన బాపట్ల జిల్లా అధ్యక్షులు తరణి గోపాల కృష్ణ మంగళవారం తెలిపారు. సంక్షేమ సేన సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాపు, బలిజ సంక్షేమ సేన అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసిన గోపాలకృష్ణకు లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మీనారాయణకు సోపిరాల గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

240 మందికి వైద్య పరీక్షలు

మేదరమెట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మవరంలో కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం సర్పంచ్ రామిరెడ్డి శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బీపీ, షుగర్, గుండె, కంటి సంబంధింత సమస్యలకు పరీక్షలను కిమ్స్ ఆసుపత్రి వైద్యులు చేశారు. 240 మంది రోగులుకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. రోగులలను డాక్టర్ రామాంజనేయులు, విజయలక్ష్మి పరీక్షించారు. ఫిజియోథెరపీ డాక్టర్ కట్టా సాయితేజా, పీఆర్వో కాలేషా పాల్గొన్నారు.


తమ్మవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న కిమ్స్ వైద్యులు